# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 270 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 24 సెప్టెంబర్ 2026


### గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో



3లో

### భక్తి పారవశ్యంతో గణనాథునికి ఘన వీడ్కోలు



3లో

## ఈసీ నియామక చట్టంపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పులు




**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 నాటి చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పు వెలువడింది. ఈ కేసును విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలా? అనే అంశంపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్.సి. శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఏకాభిప్రాయానికి మిగతా2లో...

# తెలంగాణ ఆర్థిక ప్రగతికి గ్లోబల్ సమ్మిట్ కీలకం

## - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్,సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణలో భారీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' ఏర్పాట్లను ప్రభుత్వం ముమ్మరం చేసింది. డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరగనున్న సమ్మిట్ ఏర్పాట్లపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించింది.తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యానికి అనుగుణంగా భారీ పెట్టుబడులను ఆకర్షించాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా దేశ, విదేశాల్లో రోడ్‌షోలు నిర్వహించడంతో పాటు పెట్టుబడులకు అవకాశాలు ఉన్న దేశాలు, నగరాలు, రంగాలపై ప్రత్యేక అధ్యయనం చేయాలని నిర్ణయించారు.సమ్మిట్ ఏర్పాట్ల పర్యవేక్షణ మిగతా2లో...



## రైతుల పోరాటం ఫలించింది..

**- జూరాల కాలువలకు నీటి విడుదల**
**కుడి, ఎడమ కాలువలకు సాగునీరు.. కర్ణాటక నుంచి 7 టీఎంసీల నీటికి హామీ**

**హైదరాబాద్,సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సాగునీటి కోసం జూరాల ఆయకట్టు రైతులు చేపట్టిన ఆందోళన మిగతా2లో...

## ప్రజల ముంగిటకే 'మీ సేవ'లు: మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్,సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, వేగంగా అందించేందుకు లిలి'మీ సేవ డోర్ డెలివరీ సర్వీసెస్'లిలిను ప్రారంభించింది. ఆర్టీసీ కళ్యాణ మండపంలో మంత్రి శ్రీధర్‌బాబు ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు.రాష్ట్రంలో ప్రస్తుతం 108 ప్రభుత్వ మీ సేవ కేంద్రాలతో పాటు 5,400కు పైగా ప్రైవేట్ మీ సేవ కేంద్రాలు సేవలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్‌లో మీ సేవ కేంద్రాల సంఖ్యను మరింత పెంచుతామని చెప్పారు.ఇకపై ప్రజలు మీ సేవ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయడం లేదా మీ సేవ పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకోవడం ద్వారా ఇంటి వద్ద నుంచే సేవలు పొందవచ్చని తెలిపారు. మీ సేవ ఎగ్జిక్యూటివ్‌లు నేరుగా ఇంటికి వచ్చి అవసరమైన సేవలను అందించనున్నారు.

మిగతా2లో...



## తెలుగు రాష్ట్రాలకు కొత్త బీజేపీ ఇన్‌చార్జిలు

**ఏపీకి అరవింద్ భదౌరియా.. తెలంగాణకు సునీల్ బన్సల్**
**ఇతర రాష్ట్రాల్లోనూ తెలుగు నేతలకు బాధ్యతలు**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బీజేపీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జిలు, కో-ఇన్‌చార్జిలను పార్టీ అధిష్ఠానం నియమించింది. రాష్ట్రాల్లో పార్టీ కార్యకలాపాలను మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ నియామకాలు

మిగతా2లో...

## తుమ్మల చెరువుకు గోదావరి జలాలు

**అశ్వాపురం రైతుల చిరకాల స్వప్నం సాకారం**
**'మారేళ్లపాడు ఎత్తిపోతల'ను ప్రారంభించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి**
**తొలి విడతలో 4,300 ఎకరాలకు.. దశలవారీగా 23 వేల ఎకరాలకు సాగునీరు**



2లో

## జలాల వినియోగంపై శ్వేతపత్రం ప్రకటించాలి

**- బీఆర్ఎస్ఎల్పీ ఉపనాయకుడు తన్నీరు హరీశ్‌రావు డిమాండ్**
**- గురుదక్షిణ కింద తెలంగాణ వాటాను ఆంధ్రాకు ధారాదత్తం**



**హైదరాబాద్,సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, సా గునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు ద మ్ముంటే మూడేళ్లల్లో కృష్ణ, గోదావరి జలాలు ఎంత వినియోగమయ్యాయో శ్వేతపత్రం ప్రక టించాలని బీఆర్ఎస్ ఎల్పీ ఉపనాయకుడు త న్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. గురుదక్షి ణ కింద కృష్ణ, గోదావ రి జలాలను ఆంధ్ర ప్రాం తానికి ధారాదత్తం చేయడం తప్పా రైతాంగాని కి ప్రయోజనం చేకూరిన అంశం ఒక్కటి మిగతా2లో...

## కాంగ్రెస్ వైఫల్యం వల్లే కరెంటు కోతలు

**బొగ్గు కొరతతో థర్మల్ విద్యుత్ ప్లాంట్ల మూత**
**జెన్‌కోకు నాసిరకం బొగ్గు సరఫరాతో రూ.2,900 కోట్ల నష్టం**
**నేడు పవర్‌ప్లాంట్ల సందర్శన : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్,సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యం వల్లే కరెంటు కోతలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. బొగ్గు కొరత కారణంగా థర్మల్ విద్యుత్ కేంద్రాల్లోవిద్యుత్ ఉత్పత్తి నిలిపేస్తున్నారని అన్నారు. నీటి కొరత వల్ల జల విద్యుత్ కేంద్రాలు కూడా విద్యుత్ ఉత్పత్తి చేయలేకపోతున్నాయని చెప్పారు. ఇప్పుడే విద్యుత్ కోతలు ఇలా ఉంటే వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ కేంద్రాల వద్ద వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు గురువారం ఆరు బీఆర్ఎస్ బృందాలు రాష్ట్రంలోని థర్మల్ పవర్ ప్లాంట్లు, సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని సందర్శించనున్నాయని వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేటీఆర్ మిగతా2లో...

## మా షరతులకు అంగీకరిస్తేనే హార్మూజ్‌ను తెరుస్తాం

**స్పష్టం చేసిన ఇరాన్...న్యూయార్క్‌లో అమెరికా ప్రతినిధులతో అరాగ్చీ భేటీ**





2లో



## దేవాదుల నీటిని సంపూర్ణంగా వినియోగిస్తాం: మంత్రి ఉత్తమ్

**తుంగతుర్తికి దేవాదుల జలాలు తీసుకొస్తాం..**
**ఒక్క చుక్క నీరూ వృథా కాకుండా చర్యలు**

**హైదరాబాద్,సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గోదావరి, దేవాదుల ప్రాజెక్టుల నీటిని సంపూర్ణంగా వినియోగించుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తుంగతుర్తి నియోజకవర్గానికి దేవాదుల ప్రాజెక్టు నీటిని తీసుకొస్తానని హామీ ఇచ్చారు.బుధవారం సూర్యాపేట జిల్లాలో పర్యటించిన మంత్రి ఉత్తమ్ మిగతా2లో...

# రైతుల పోరాటం ఫలించింది..

(మొదటి పేజీ తరువాయి)

ఫలించింది. వారం రోజులుగా పంట కాలువలకు నీటిని విడుదల చేయాలని రైతులు చేస్తున్న పోరాటం నేపథ్యంలో బుధవారం జూరాల రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేశారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పంట కాలువలకు నీరు విడుదల చేయాలని రైతులు ఆందోళన చేపట్టగా, గత రెండు రోజులుగా నిరసనలు మరింత ఉధృతమయ్యాయి. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కూడా మద్దతు ప్రకటించారు. తాగునీటి అవసరాలకు మాత్రమే జూరాలలో నీరు ఉందని అధికారులు చెప్పడంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. **కర్ణాటక నుంచి నీటికి హామీ**జూరాల ఆయకట్టు రైతుల సాగునీటి సమస్యను ఉమ్మడి పాలమూరు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కర్ణాటకకు వెళ్లిన ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజాప్రతినిధులు బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసి జూరాలకు నీటిని విడుదల చేయాలని కోరారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని 30 రోజులపాటు రోజుకు 5 వేల క్యూసెక్కుల చొప్పున మొత్తం 7 టీఎంసీల నీటిని జూరాల ప్రాజెక్టుకు విడుదల చేస్తామని డీకే శివకుమార్ హామీ ఇచ్చినట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. **2,687 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులోకి ప్రస్తుతం 2,687 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు బుధవారం ఉదయం 8 గంటల సమయంలో కుడి, ఎడమ కాలువల వద్దకు చేరుకుని తూములను తెరిచి నీటిని విడుదల చేశారు. ఇన్‌ఫ్లో ఇదే స్థాయిలో కొనసాగితే ప్రాజెక్టు నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటే స్పిల్‌గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. **రైతుల్లో ఉపశమనం** సాగునీటి కోసం రైతులు చేపట్టిన ఆందోళన నేపథ్యంలో కాలువలకు నీరు విడుదల కావడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు కర్ణాటక నుంచి 7 టీఎంసీల నీటి విడుదలకు హామీ లభించడంతో జూరాల ఆయకట్టు సాగునీటి అవసరాలకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ వైఫల్యం వల్లే కరెంటు కోతలు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు కరెంట్ విలాస వస్తువు కాదనీ, జీవనరేఖ అని అన్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, పరిశ్రమలు, ఐటీ రంగం, గృహ అవసరాలు అన్నింటికీ విద్యుత్ అత్యంత కీలకమని చెప్పారు. విద్యుత్ సమస్యపైనే తెలంగాణ మలిదశ ఉద్యమానికి పునాది పడిందని గుర్తుచేశారు. ‘ఎల్‌నినో కాదు.. ఎల్ కాంగో’ విద్యుత్ సంక్షోభానికి ఎల్‌నినో ప్రభావం కారణం కాదనీ, ఎల్ కాంగో (కాంగ్రెస్) ప్రధాన కారణమని కేటీఆర్ విమర్శించారు. విద్యుత్ సంక్షోభానికి సింగరేణి బొగ్గు సరఫరా వ్యవస్థ కూడా ఒకటని అన్నారు. సింగరేణితో సర్కార్ ఫుట్‌బాల్ సింగరేణి సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఫుట్‌బాల్ ఆట ఆడుతున్నదని కేటీఆర్ అన్నారు. సింగరేణితో కార్మికులు, రైతులు, ప్రజలు ఆటలాడే పరిస్థితి రావొద్దని కోరారు. సింగరేణిలో సైట్ విజిటేషన్ సర్టిఫికెట్ల పేరుతో అక్రమాలు, సోలార్ పవర్ టెండర్లలో అవకతవకలు జరిగాయని విమర్శించారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి 2023–24లో 70 మిలియన్ టన్నుల నుంచి 2025–26లో 58 మిలియన్ టన్నులకు ఎందుకు పడిపోయిందని ప్రశ్నించారు. వ్యవసాయానికి ఆరు గంటల కరెంటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయానికి ఆరు గంటలకు మించి కరెంట్ సరఫరా కావడం లేదని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు‘ కాంగ్రెస్ అధికారంలో ఉంటే కరెంటు ఉండదని కేటీఆర్ అన్నారు. అదే ఇప్పుడు నిజమైందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనూ రైతులు విద్యుత్ కోతలపై రోడ్డెక్కారని గుర్తు చేశారు. విద్యుత్ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఆరు బీఆర్ఎస్ బృందాలు గురువారం పవర్ స్టేషన్లను సందర్శిస్తాయని చెప్పారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌ను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్, భూపాలపల్లిలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చెన్నూరు నియోజకవర్గం జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, అనిల్ జాదవ్‌ల బృందం సందర్శిస్తుందని వివరించారు. హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే వివేకానందగౌడ్ పరిశీలిస్తారని చెప్పారు. మాజీమంత్రులు తాటికొండ రాజయ్య, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, ఎల్ రమణ, ఎమ్మెల్యేలు కెపి వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు ఎ జీవన్‌రెడ్డి, బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మల చెరువుకు గోదావరి జలాలు

**హైదరాబాద్,సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తుమ్మల చెరువుకు గోదావరి జలాలు అందించాలన్న రైతుల చిరకాల కోరిక నెరవేరిందని మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలంలో సీతారామ కాలువపై నిర్మించిన మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని బుధ వారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. పంపులు ఆన్ చేసి గోదావరి జలాలను తుమ్మల చెరువుకు విడుదల చేశారు. సుమారు రూ.610 కోట్ల అంచనాతో చేపట్టిన ఈ పథకం ద్వారా తొలి విడతలో 4,300 ఎకరాలకు, దశలవారీగా అశ్వాపురం మండలంలో 22 నుంచి 23 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. అనంతరం గొందిగూడెంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి అశ్వాపురం, పినపాక నుంచి పాలేరు వరకు గోదావరి జలాలను తీసుకెళ్లాలని నిర్ణయించామన్నారు. ఆర్థిక ఇబ్బందులు, అనుమతులు, సవరించిన అంచనాలను అధిగమిస్తూ పనులు చేయిస్తున్న్న తెలిపారు. సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీలకు అదనపు నిధులను సీఎం మంజూరు చేశారని, ఇల్లెందుకు జూలూరుపాడు టన్నెల్, లలితాపురం వద్ద ఎత్తిపోతలపై సర్వేలు చేసి అంచనాలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. అన్నదైవం ప్రాజెక్టుకు కూడా జలాలు విడుదల చేస్తున్నామని చెప్పారు. భూసేకరణలో రైతులు సహకరించాలని కోరారు. న్యాయమైన పరిహారం రైతులకు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా పది నియోజకవర్గాల్లో సాగునీటి విస్తరణకు కృషి చేస్తున్నామని, భద్రాచలంలో ప్రగళ్లపల్లి ఎత్తిపోతలతో పాలెంవాగు, తాలిపేరు, మోడికుంటవాగు అనుసంధానం చేస్తే మరిన్ని మండలాలకు నీరు అందుతుందన్నారు. ప్రస్తుత వర్షాభావం, ఎల్‌నినో నేపథ్యంలో నీరు, విద్యుత్‌ను పొదుపుగా వాడాలని, రబీలో తక్కువ నీటి పంటలు వేయాలని సూచించారు. ఆయిల్‌పామ్ మొక్కలు అందిస్తామన్నారు. రూ.350 కోట్లతో భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభించామని, పుష్కరాల నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పులుసుబొంత్ ప్రాజెక్టు భూసేకరణ, ప్రత్యామ్నాయ భూముల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు నిధులు మంజూరు చేసి టెండర్లు పిలుస్తామన్నారు. బూర్గంపాడులో దొమ్మలవాగు రిజర్వాయర్‌పై ప్రజల అవసరాల మేరకు చర్యలు తీసుకుంటామని, గిరిజన గుడిసె వాసులకు ఇందిరమ్మ ఇండ్లలో ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. పేదలు, రైతులు, గిరిజనులు, మహిళలు, యువత సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎంపీ పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ మారేళ్లపాడు ద్వారా అశ్వాపురంలో 24 గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దశాబ్దాల కల నెరవేరిందని, గోదావరి జలాలు తుమ్మల చెరువుకు చేరడం పండుగ వాతావరణం తెచ్చిందన్నారు. తుమ్మల ప్రధాన కాలువకు లైనింగ్, 22 కి.మీ డిస్ట్రిబ్యూటరీలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మణుగూరు రేగులగండి చెరువుకు నీరిస్తే 4 వేల ఎకరాల్లో మూడు పంటలు పండుతాయని, దొమ్మలవాగును మినీ రిజర్వాయర్‌గా చేయాలని కోరగా మంత్రులు సానుకూలంగా స్పందించారన్నారు. కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. మారేళ్లపాడుతో పాటు జిల్లాలో 16 వేల ఎకరాలకు సాగునీటి పనులకు శ్రీకారం చుట్టామని, పులుసుబొంత్‌కు కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ భూముల గుర్తింపు కొనసాగుతోందన్నారు. అశ్వారావుపేట, దమ్మపేట, చంద్రుగొండ సహా 8 మండలాల్లో డిస్ట్రిబ్యూటరీల సర్వే 60 శాతం పూర్తయిందని, సీతమ్మసాగర్‌కు 600 ఎకరాల భూసేకరణ అవార్డు దశలో ఉందని, రూ.46 కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, ఎస్పీ రోహిత్ రాజ్, డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

# జలాల వినియోగంపై శ్వేతపత్రం ప్రకటించాలి

(మొదటి పేజీ తరువాయి)

కూడా లేదని దుయ్యబట్టారు. బుధవారం నాగర్‌కర్నూ ల్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావే శంలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం పేరు చెప్పి కాంగ్రెస్ నేతలంతా ప్రకృతిని నింది స్తున్నారని, పాలమూరు జిల్లాలో ప్రతీ ప్రాజెక్టు ను సందర్శిస్తే కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలు కన్పి స్తున్నాయన్నారు. కృష్ణానది జలాల వినియోగం లో ట్రైబ్యునల్ తీర్పు వచ్చే వరకు 36 టీఎంసీల నీటిని తెలంగాణ సాగు భూములకు మళ్లించే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రయత్నాలు చేయలేని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంకెల గారడీతో రైతాంగాన్ని మోసగించే ప్రయత్నం చే యడం ఏమాత్రం సహించరని విషయమన్నా రు. కేసీఆర్ చాలా దూరదృష్టితో కృష్ణ, గోదావరి జలాలపై లిఫ్టులు, రిజర్వాయర్లు నిర్మించారని, బీఆర్ఎస్ పాలన, కాంగ్రెస్ అధికారంలో ఎన్ని ఎకరాల సాగు భూములకు నీరందించారో వివ రాలతో శ్వేతపత్రం ప్రకటించాలని ఆయన డి మాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొం త జిల్లాలో ఎకరా పంట ఎండినా సహించబో మని ఇందుకోసం ఉద్య మిస్తామని స్పష్టం చే శారు. రాబోయే కాలంలో కృష్ణా, గోదావరి నదీ జలాలను మళ్లించే ప్రయత్నం చేస్తే మహోద్య మం తప్పదని హెచ్చరించారు. కేఎల్ఐ కింద ఆ యకట్టులో సింహభాగానికి, పాలమూరు రంగా రెడ్డి ఎత్తిపోతల పథకం కింద నార్లాపూర్, ఏదు ల, వట్టెం రిజర్వాయర్ల వరకు కృష్ణా జలాలను పంపింగ్ చేసిన ఘనత కేసీఆర్‌దేనని ఈ అంశంపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ నేతలు సిద్ధం కావాలని, వేదిక వాళ్లే నిర్ణయించాలని హరీశ్‌రావు సవాల్ విసిరారు. మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 3 రోజులు భారీ వర్షాలు.. తీరం వైపు తీవ్ర వాయుగుండం

## నేటి అర్ధరాత్రి కళింగపట్నం దక్షిణంవైపు తీరం దాటే చాన్స్

## పలు రాష్ట్రాల్లో నైరుతి నిష్క్రమణ

**హైదరాబాద్,సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పశ్చిమ–మధ్య బంగాళాఖాతం, వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉన్నదని హైదరాబాద్ వాతావారణశాఖ తెలిపింది. గోపాల్‌పురం–కళింగ పట్టణానికి సమీపంలో తీవ్ర వాయుగుండంగా బలపడి బుధవారం అర్ధరాత్రి కళింగపట్నం దక్షిణ తీరాన్ని దాటే అవకాశం ఉన్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో తెలంగాణలో గురు, శుక్రవారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని పేర్కొన్నారు.

# ఈసీ నియామక చట్టంపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పులు

(మొదటి పేజీ తరువాయి)

రాలేకపోయింది. దీంతో ఇద్దరు న్యాయమూర్తులు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. **ఏకగ్రీవ తీర్పు వచ్చి ఉంటే బాగుండేది: దత్తా** ఈ అంశంపై ధర్మాసనం ఏకగ్రీవ నిర్ణయానికి వచ్చి ఉంటే సంస్థాగత ఐక్యతకు మరింత ప్రయోజనకరంగా ఉండేదని జస్టిస్ దీపాంకర్ దత్తా పేర్కొన్నారు. అభిప్రాయ భేదాలు ఏర్పడటంతో సుదీర్ఘమైన ఉత్తర్వులు వెలువరించాల్సి వచ్చిందని తెలిపారు. **పాలకులు చట్టానికి లోబడి ఉండాలి** తీర్పు సందర్భంగా జస్టిస్ దత్తా కీలక వ్యాఖ్యలు చేశారు. “పాలకులు చట్టానికి లోబడి ఉండాలి.. ఎవరూ చట్టానికి అతీతులు కారు” అని స్పష్టం చేశారు. వ్యక్తుల ఇష్టాయిష్టాలకు అనుగుణంగా కాకుండా రాజ్యాంగం, చట్టాల పరిధిలోనే పరిపాలన సాగాలని ఆయన ఉద్ఘాటించారు. **కొలీజియం వ్యవస్థపై స్పష్టత** జడ్జీల నియామకం, కొలీజియం వ్యవస్థపై జరుగుతున్న ప్రచారంపైనా సుప్రీంకోర్టు స్పందించింది. “జడ్జీలే తమ సహచర జడ్జీలను నియమించుకుంటున్నారు” అనే ప్రచారం వాస్తవానికి దూరంగా ఉందని పేర్కొంది. న్యాయమూర్తుల అభ్యర్థుల పరిశీలన, ఎంపిక ప్రక్రియలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇతర నిఘా వ్యవస్థల పాత్ర కూడా ఉంటుందని ధర్మాసనం వివరించింది.

# తెలుగు రాష్ట్రాలకు కొత్త బీజేపీ ఇన్‌చార్జిలు

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జిగా డాక్టర్ అరవింద్ భదౌరియా, కో–ఇన్‌చార్జిగా వనతి శ్రీనివాసన్‌ను నియమించారు. తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జిగా సునీల్ బన్సల్, కో–ఇన్‌చార్జిలుగా అభయ్ పాటిల్, రేఖా శర్మలను నియమించారు. **ఇతర రాష్ట్రాల్లో తెలుగు నేతలకు బాధ్యతలు** తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులకు ఇతర రాష్ట్రాల సంస్థాగత బాధ్యతలను కూడా పార్టీ అప్పగించింది. ఏపీ బీజేపీ నేత, మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురందేశ్వరిని ఒడిశా బీజేపీ ఇన్‌చార్జిగా నియమించారు. తెలంగాణకు చెందిన డీకే అరుణకు తమిళనాడు బీజేపీ కో–ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. డాక్టర్ కసమ్ వెంకటేశ్వర్లును కర్ణాటక బీజేపీ కో–ఇన్‌చార్జిగా నియమించారు. **సంస్థాగత విస్తరణపై దృష్టి** రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత కార్యకలాపాలను సమన్వయం చేయడం, రాష్ట్ర నాయకత్వంతో కలిసి పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం ఇన్‌చార్జిల ప్రధాన బాధ్యతల్లో భాగంగా ఉంటుంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో 28 జిల్లాలకు బీజేపీ జిల్లా ఇన్‌చార్జిలను నియమించడంతో పాటు రాష్ట్ర కార్యవర్గాన్ని పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో తాజా జాతీయ స్థాయి నియామకాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ ప్రకటించినట్లు సమాచారం. ఇదే సమయంలో కొత్త జాతీయ బృందంలో తరుణ్ చుగ్‌కు కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

# మా షరతులకు అంగీకరిస్తేనే హార్ముజ్‌ను తెరుస్తాం

**న్యూయార్క్ సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాలకు హాజరవుతున్న ఇరాన్ ప్రతినిధులతో అమెరికా అధికారులు న్యూయార్క్‌లో మూడు గంటల పాటు సమావేశమయ్యారు. ఈ భేటీ సానుకూలంగా జరిగిందని, ఒప్పందానికి రావడం రాకపోవడం ఇరాన్‌పై ఆధారపడి ఉన్నదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ‘ఇది ఓ మంచి సమావేశం. ఒప్పందానికి వస్తే వారికే ప్రయోజనం’ అని వ్యాఖ్యానించారు. ఘర్షణల నివారణ కోసం ఇరాన్ ఎందుకు ఒప్పందం చేసుకోవడం లేదో తాను ఊహించలేకపోతున్నానని చెప్పారు. ఐరాస సర్వసభ్య సమావేశాలకు హాజరవుతున్న ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అమెరికా ప్రత్యేక రాయబారులు స్టీవ్ విట్‌కాఫ్, జేర్డ్ కుష్నర్‌లతో చర్చలు జరిపారు. ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని వెంటనే ఎత్తివేయాలని, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని, అన్ని రకాల పోరును నిలిపివేయాలని అరాగ్చీ ఈ సందర్భంగా డిమాండ్ చేశారని తెలిసింది. ఈ డిమాండ్లను నెరవేరిస్తే హార్ముజ్ జలసంధిని తెరుస్తామని ఆయన చెప్పారు. ‘వారు నాతో మాట్లాడాలని అనుకుంటున్నారు. వారు మాతో మాట్లాడుతూనే ఉన్నారు. ఈ రోజు కూడా మాట్లాడారు. ఈ సంబంధం అభివృద్ధి చెందుతోంది’ అని ఆయన తెలిపారు. చర్చలు కొనసాగుతాయని అంటూ అంతిమంగా ఒప్పందం కుదురుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అయితే అణ్వాయుధాన్ని పొందకుండా ఇరాన్‌ను నిరోధిస్తామని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఇరాన్ ప్రతినిధులతో చర్చలపై తాను చాలా సంతోషంగా ఉన్నానని విట్‌కాఫ్ వ్యాఖ్యానించారు. మధ్యవర్తులు తమ ప్రయత్నాలు కొనసాగిస్తారని ఆయన చెప్పారు. కాగా గల్ఫ్, ప్రాంతీయ దేశాల దౌత్య యత్నాల కారణంగానే అమెరికా, ఇరాన్ ప్రతినిధులు చర్చలు జరిపారని తెలుస్తోంది.

# తెలంగాణ ఆర్థిక ప్రగతికి గ్లోబల్ సమ్మిట్ కీలకం

(మొదటి పేజీ తరువాయి)

కోసం సుమారు 10 ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. సీనియర్ అధికారులు, మంత్రులకు వివిధ బాధ్యతలు అప్పగించడంతో పాటు ప్రత్యేక వార్‌రూమ్‌ను ఏర్పాటు చేసి రోజువారీగా ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. సమ్మిట్‌కు విస్తృత ప్రచారం కల్పించేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా వేదికలను వినియోగించాలని నిర్ణయించారు. అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, గతంలో కుదిరిన ఎంవోయూల అమలు పురోగతిని సమీక్షించాలని భట్టి సూచించారు. ప్రతినిధుల స్పందనను బట్టి సభా ప్రాంగణాల సంఖ్యను ప్రస్తుత 4 నుంచి 6 లేదా 8కు పెంచే అంశాన్ని పరిశీలించనున్నారు. మూడు రోజుల కార్యక్రమంగా మాత్రమే కాకుండా తెలంగాణకు దీర్ఘకాలికంగా పెట్టుబడులు, ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే వేదికగా గ్లోబల్ సమ్మిట్‌ను తీర్చిదిద్దాలని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.

# ప్రజల ముంగిటకే ‘మీ సేవ’లు: మంత్రి శ్రీధర్‌బాబు

(మొదటి పేజీ తరువాయి)

జనన, మరణ ధృవీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస ధృవీకరణ పత్రాలు, ఈసీ కాపీలు, పోలీస్ శాఖ సేవలు, ఐజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు తదితర పౌర సేవలను డోర్ డెలివరీ ద్వారా అందించనున్నారు. తొలిదశలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ సేవలను అమలు చేసి, అనంతరం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

# దేవాదుల నీటిని సంపూర్ణంగా వినియోగిస్తాం: మంత్రి ఉత్తమ్

(మొదటి పేజీ తరువాయి)

కుమార్ రెడ్డి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. **ఒక్క చుక్క నీరూ వృథా కాకుండా..** 365 టీఎంసీల నీటిని ఒక్క చుక్క కూడా వృథా కాకుండా వినియోగించుకునేలా కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు. దేవాదుల ప్రాజెక్టు నీటి లభ్యత, వినియోగంపై వివరాలు వెల్లడించారు. రాజకీయ దురుద్దేశాలకు తావులేకుండా గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులకు అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. **తాటిపాముల అభివృద్ధికి కృషి** అధికారంలో ఉన్నా లేకున్నా తన తండ్రి కోరిక మేరకు తాటిపాముల గ్రామాన్ని తన శక్తి మేర అభివృద్ధి చేస్తానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి తన వంతు కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# భక్తి పారవశ్యంతో గణనాథునికి ఘన వీడ్కోలు

**- చల్లటి చినుకుల్లోనూ భక్తి పరవళ్లు**

**- నవరాత్రులు భక్తుల పూజలందుకున్న విఘ్నేశ్వరుడు వైభవంగా నిమజ్జనానికి పయనం**

**- అలసిన భక్తులకు 'టిడబ్ల్యూజేఎఫ్' ఆధ్వర్యంలో పులిహోర, చల్లటి మంచినీటి సేవలు**







**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలు, మంత్రోచ్ఛారణలు, భక్తి శ్రద్ధలతో కొలువుదీరిన విఘ్నేశ్వరుడు ఘనంగా వీడ్కోలు అందుకున్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని నలుమూలల నుంచి వివిధ ఆకృతుల్లో అలంకరించబడిన గణనాథుల విగ్రహాలు భక్తుల కోలాహలం, డప్పు వాయిద్యాల మోత, భక్తుల నృత్యాల నడుమ నిమజ్జనానికి తరలివెళ్లాయి. చల్లటి చినుకులు కురుస్తున్నా భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. వర్షపు చినుకులను సైతం విఘ్నేశ్వరుడి ఆశీస్సులుగా భావిస్తూ భక్తులు భక్తిపారవశ్యంలో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ వాహనాలపై వైభవంగా తరలివచ్చిన గణనాథులు భక్తుల జయజయధ్వానాల మధ్య ధంసలాపురం నిమజ్జన ఘాట్‌కు చేరుకున్నారు. డప్పుల మోతకు అనుగుణంగా యువత, మహిళలు, చిన్నారులు భక్తి నృత్యాలతో సందడి చేయగా, పరిసర ప్రాంతమంతా గణనాథుడి నామస్మరణతో మార్మోగింది. తొమ్మిది రోజుల పాటు భక్తుల ఆధ్యాత్మిక భావోద్వేగాలకు కేంద్రంగా నిలిచిన విఘ్నేశ్వరుడికి కన్నుల పండువగా వీడ్కోలు పలికారు. **భక్తులకు అండగా 'టిడబ్ల్యూజేఎఫ్' సేవలు :** నిమజ్జనానికి తరలివచ్చిన భక్తుల అలసటను గుర్తించి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ నాయకత్వం మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలను చేపట్టింది. ముస్తఫా నగర్ ప్రాంతంలో భక్తులకు ఉచితంగా పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేయడంతో పాటు చల్లటి మంచినీటిని అందించారు. గంటల తరబడి నిమజ్జన వేడుకల్లో పాల్గొని అలసిపోయిన భక్తులకు ఈ సేవలు ఆప్యాయతను, ఆత్మీయతను పంచాయి. ఫెడరేషన్ నాయకులు శీలం వెంకటేశ్వరరెడ్డి (ఎస్వీ రెడ్డి) ఆధ్వర్యంలో నిర్వహించిన పులిహోర ప్రసాదం, మంచినీటి సేవలను టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు టిఎస్ చక్రవర్తి లు అభినందించారు. గణేష్ నిమజ్జన మహోత్సవంలో భక్తులకు ఆహారం, తాగునీరు అందించడం పుణ్యకార్యమే కాకుండా మానవత్వానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలందుకున్న గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలుకుతూ, అదే సమయంలో నిమజ్జనానికి వచ్చిన భక్తులకు సేవ చేయడం ద్వారా భక్తి, సేవ, మానవతా విలువలను ఒకే వేదికపై చాటిన కార్యక్రమంగా ఈ సేవా కార్యక్రమం నిలిచిందన్నారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో, భక్తుల ఆదరాభిమానాలతో సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. సేవలను స్వీకరించిన పలువురు భక్తులు టిడబ్ల్యూజేఎఫ్ నాయకత్వాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ జానిపాషా, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, సయ్యద్ అంజద్, పత్తి శ్రీనివాస్, నాయకులు వి. రోశిరెడ్డి, ఏ. మురళి, బి. రవి, ఖమ్మం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# హిందూ.. ముస్లిం భాయి..భాయి

**గంగా తెహజీబ్ కు కేరాఫ్ కరీంనగర్..**

**దేశంలోనే ఆదర్శంగా సేవలు...**

**గణేష్ నిమజ్జనం రోజు మినరల్ వాటర్, లస్సీ, బాదం మిల్క్, కూల్ డ్రింక్స్, రోజ్ వాటర్..**

**స్వంత ఖర్చులతో హిందూ సోదరులకు అందిస్తున్న ఎంఐఎం నేత**

**గులాం అహ్మద్ హుస్సేన్**

**2005 నుంచి నేటి వరకు మానవత్వమే అభిమతంగా జమ్.. జమ్ వెల్ఫేర్ సొసైటీ**

**స్టాల్స్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీసు కమిషనర్ గౌష్ ఆలం, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్23(పిసిడబ్ల్యూ న్యూస్):** మానవత్వమే అభిమతంగా, దేశంలో ఎక్కడా లేని విధంగా.. మతసామరస్యానికి ప్రతీకగా, గంగా జమున తెహజీబ్ కు కేరాఫ్ కరీంనగర్ నగర వేదికగా, హిందూ-ముస్లిం భాయి భాయి అనే నినాదంతో జమ్.. జమ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 2005 నుండి ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు.. సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తన స్వంత ఖర్చుతో హిందూ ముస్లిం సోదర భావాన్ని పెంపొందించేందుకు, మానవత్వపు పునాదిగా అద్భుతమైన సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడని, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, జిల్లా పోలీసు కమిషనర్ గౌష్ ఆలం, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి లు అన్నారు.. బుధవారం గణేష్ నిమజ్జనం సందర్భంగా, నగరంలోని రాజీవ్ చౌక్ లో బాదం మిల్క్, మినిరల్ వాటర్, లస్సీ, రూ అబ్జా, గులాబ్ వాటర్ స్టాల్ ను సీపీ గౌష్ ఆలం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత పెద్ద స్టాల్ ను రాజీవ్ చౌక్ లో ఏర్పాటు చేసి సుమారు 30వేల మంది హిందూ సోదరుల కోసం ఉచిత మినరల్ వాటర్ బాటిల్స్, గులాబ్ వాటర్, లస్సీ.. బట్టర్ మిల్క్, బాదాం మిల్క్ ను పంపిణీ చేస్తూ.. దేశంలోనే గులాం అహ్మద్ ఆదర్శంగా నిలుస్తున్నడాని పేర్కొన్నారు. దేశంలోనే భిన్నంగా.. మత సామరస్యానికి ప్రతీకగా, గంగా జమున తెహజీబ్ కు కేరాఫ్ గా కరీంనగర్లో హిందూ-ముస్లిం అనే భేదభావం లేకుండా ఒక మంచి సాంప్రదాయాన్ని కొనసాగించే పద్ధతిలో భాగంగా గణేష్ నిమజ్జానికి వెళ్లే నగర హిందూ సోదరీ, సోదరుల కోసం ప్రత్యేకంగా స్టాల్ ను ఏర్పాటు చేసి ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా త్రాగునీరు, శీతల పానీయాలు పంపిణీ చేయడం ఎంతో మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. నిమజ్జనానికి వెళు తున్న అశేష జనానికి సరిపడా ఈసౌకర్యాన్ని జమ్ జమ్ వెలేర్ సొసైటీ ద్వారా స్టాల్ ఏర్పాటు చేసి సేవలందించడం మతసామరస్యానికి మారుపేరుగా నిలిచిందని కొనియాడారు. ప్రారంభోత్సవానికి వచ్చిన కలెక్టర్ చిత్రా మిశ్రా, సిపి గౌస్ ఆలం, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి లకు, గులాం అహ్మద్ హుస్సేన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏసీపీలు వెంకటస్వామి, విజయ్ కుమార్, వాసాల సతీష్, ఎస్బిఐ అనీల్ కుమార్, సిఐలు రాంచంద్రరావు, తిరుమల్, సృజన్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, ఎస్బి ఎస్సై శ్రీనివాస్, ఎంఐఎం కార్పొరేటర్లు సయ్యద్ ఇబ్రహీం,మాజిద్ హుస్సేన్, మాజీ కార్పొరేటర్ లు అహ్మద్ మొహియుద్దీన్ బాబుజానీ, ఆరిఫ్ అహ్మద్, లింగపల్లి శ్రీను, నాయకులు అబ్దుల్ గఫ్ఫార్, వాజిద్ అలీఖాన్, ఖాజా మజారోద్దీన్, గాలి రాజు, అబ్దుల్లా ఖాన్, అక్బర్ అలీ, అన్నేమల్ల సురేశ్, మేరాజ్, తాజుద్దీన్, ఖమరొద్దీన్ షబ్బీర్, సలీం, సాజిద్, ఇలియాజ్, బాబా ఖాలీద్, రెహన్,యాసర్,సుల్తాన్ మీర్జా, షెహరాజ్ పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో



**పరకాల, సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలోని చలివాగు వద్ద కొనసాగుతున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని బుధవారం పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) డి.ఎస్. వెంకన్న పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమం సందర్భంగా భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టిన ఏర్పాట్లను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పవన్ కుమార్, పరకాల తహసీల్దార్ టి. విజయలక్ష్మి, ఎంపీడీవో, పరకాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్, విద్యుత్ శాఖ ఏ.డి.తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భారీ వర్ష సూచన.. అప్రమత్తంగా ఉండాలి


**● అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు**

**● గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై అధికారులతో సబ్ కలెక్టర్ సమీక్ష**




**కల్లూరు, సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రానున్న 48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. వర్షాల నేపథ్యంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అధికారులు అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కల్లూరు డివిజన్‌లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై బుధవారం సంబంధిత శాఖల అధికారులతో సబ్ కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా, రహదారుల పరిస్థితి, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, అగ్నిమాపక ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తు, నీటి వనరుల వద్ద భద్రత తదితర అంశాలపై సమీక్షించారు. భారీ వర్షాల నేపథ్యంలో చెరువులు, వాగులు, ఇతర నీటి వనరుల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన భద్రతా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య, విద్యుత్, అగ్నిమాపక తదితర శాఖలు పరస్పర సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సూచించారు.

# ఘనంగా శిశుమందిర్ వినాయక నిమజ్జనం..





**కరీంనగర్, సెప్టెంబర్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీ సరస్వతి శిశుమందిర్ హైస్కూల్, కరీంనగర్‌లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన వినాయక విగ్రహానికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ఆచార్యులు మరియు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని భక్తిగీతాలు, నినాదాలు, డప్పుల వాయిద్యాలతో వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్లారు. "గణపతి బప్పా మోరియా మంగళమూర్తి మోరియా" నినాదాలతో కార్యక్రమం సందడిగా సాగింది. విద్యార్థుల్లో భక్తితో పాటు ఐక్యత, క్రమశిక్షణ, సేవాభావం, పర్యావరణ పరిరక్షణ మరియు దేశభక్తి వంటి విలువలను పెంపొందించే విధంగా ఉత్సవాలను నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ప్రకృతికి హాని కలగకుండా నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ మాట్లాడుతూ, వినాయకుడు జ్ఞానం, వివేకం, ఏకాగ్రత మరియు విఘ్నాలను అధిగమించే శక్తికి ప్రతీక అని, విద్యార్థులు వినాయకుని గుణాలను తమ జీవితంలో ఆచరించాలని సూచించారు. పండుగలు కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా సంస్కారం, సమాజ ఐక్యత మరియు దేశభక్తిని పెంపొందించే వేదికలుగా ఉండాలని తెలిపారు. చివరగా భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహానికి నిమజ్జనం నిర్వహించి, వచ్చే ఏడాది మరింత ఆనందంగా తిరిగి రావాలని పాఠశాల కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి ఆకాంక్షించారు. వినాయక నిమజ్జన కార్యక్రమంలో ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, అడ్వకేట్ బొడ్ల శ్రీనివాస్, విద్యార్థులు, ఆచార్యులు, సిబ్బంది మరియు తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కరీంనగర్‌లో ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవం

**● కొత్తపల్లి నిమజ్జనం పాయింట్‌ను ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్ ● శోభయాత్రతో తరలివచ్చిన గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేసి... వీడ్కోలు పలికిన మేయర్**





**కరీంనగర్, సెప్టెంబర్23(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలో గత తొమ్మిది రోజులుగా భక్తుల పూజలు, భజనలు, విశేష అభిషేకాలందుకున్న లంబోదరుడు గంగమ్మ ఒడికి చేరేందుకు సిద్ధమయ్యాడు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో గణేష్ నిమజ్జన ఉత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రారంభమయ్యాయి. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొత్తపల్లి వద్ద ఏర్పాటు చేసిన నూతన నిమజ్జనం పాయింట్ వద్ద విగ్రహాల నిమజ్జన ప్రక్రియ శోభాయమానంగా మొదలైంది. ఈ కార్యక్రమాన్ని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ లాంఛనంగా ప్రారంభించారు. కొత్తపల్లి పాయింట్‌కు తరలివచ్చిన మొట్ట మొదటి వినాయక విగ్రహానికి మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేసి....క్రేన్ సహాయంతో విగ్రహాన్ని నిమజ్జనం చేసి, విగ్నేశ్వరుడికి భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు.

# శ్రీ మహాశక్తి దేవాలయంలో సహస్ర మోదక లక్ష్మీ గణపతి హోమం




**కరీంనగర్,సెప్టెంబర్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీ మహాశక్తి దేవాలయంలో నిర్వహించిన సహస్ర మోదక లక్ష్మీ గణపతి హోమం కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సతీమణి బండి అపర్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.హోమ కార్యక్రమం అనంతరం గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఎల్ఎండి కాలనీ శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు..

**- పూజా కార్యక్రమానికిహాజరైన కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్**

**తిమ్మాపూర్, సెప్టెంబర్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ గ్రామ పరిధిలోని ఎల్ఎండి కాలనీలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా, కన్నుల పండువగా జరిగాయి. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేడుకలతో కాలనీ అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. నవరాత్రి వేడుకల్లో భాగంగా కాలనీలో సామూహిక కుంకుమార్చనలు, గణనాథునికి నిత్య పూజలు ఘనంగా నిర్వహించారు.ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ అన్న ప్రసాద వితరణలో భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు.ప్రతిరోజూ సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు యువతను,



చిన్నారులను ఎంతగానో అలరించాయి.శివాజీ యూత్ సభ్యుల ప్రత్యేక ఆహ్వానం మేరకు వినాయక నవరాత్రి ఉత్సవాల్లో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా



ఆయన విఘ్నేశుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ, మహాత్మానగర్ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మేయర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శివాజీ సేన యూత్ బాధ్యులు, బీజేవైఎం నాయకులు దుర్శేటి అజయ్, కుంట మల్ల ప్రేమ్ చాంద్, కూర శివారెడ్డి, అక్షయ్‌తో పాటు మహాత్మా నగర్ గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో మూడు రోజుల సీరతున్నబీ నీ ఎక్స్‌పో




**కరీంనగర్,సెప్టెంబర్23(పీసీడబ్ల్యూ న్యూస్):** జమాతే ఇస్లామీ హింద్ కరీంనగర్ ఆధ్వర్యంలో మూడు రోజుల సీరతున్నబీ నీ ఎక్స్‌పో ఈ నెల 25, 26, 27 తేదీల్లో కరీంనగర్ సర్కస్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు.ఈ ఎక్స్‌పోను శుక్రవారం సెప్టెంబర్ 25న జుమా నమాజ్ అనంతరం మధ్యాహ్నం 2:30 గంటలకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి జమాతే ఇస్లామీ హింద్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సొహైబ్ అహ్మద్ ఖాన్, ఏపీసీఆర్ కోఆర్డినేటర్ వసీం అహ్మద్, కరీంనగర్ కమ్మన్‌పూర్‌కు చెందిన అన్వర్ సాహెబ్, మంకమ్మతోట యూనిట్ అధ్యక్షుడు ఖైరుద్దీన్, ముక్రంపుర జమాతే ఇస్లామీ హింద్ అధ్యక్షుడు షోయబ్ లతీఫ్ తదితరులు పాల్గొననున్నారు.కాగా, జమాతే ఇస్లామీ హింద్ ప్రతినిధులు మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ను కలిసి సీరతున్నబీ నీ ఎక్స్‌పోకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎక్స్‌పో నిర్వహణకు జమాతే ఇస్లామీ హింద్ చేస్తున్న కృషిని మంత్రి అభినందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# శ్రీ దండు మైసమ్మ (మారమ్మ) ఆలయాన్ని పరిశీలించిన అర్చక సమాఖ్య, జేఏసీ బృందం



**బేగంపేట సెప్టెంబర్ 23,(పిసిడబ్ల్యూ న్యూస్) :** దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఆదేశాల మేరకు బాలం రాయి శ్రీ శ్రీ శ్రీ దండు మారమ్మ



ఆలయాన్ని పలు సంఘాల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గట్టు శ్రీనివాసాచార్యులు పరాశరం రవీంద్రాచార్యులు అర్చక జేఏసీ కన్వీనర్ మరియు రిపంజయశర్మ, అర్చక సమాఖ్య ప్రతినిధి శ్రీనివాసచార్యులు ఆలయాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఆలయ పరిరక్షణ, అభివృద్ధికి సంబంధించిన అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. అనంతరం దేవాదాయ శాఖ డీసీ వినోద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆలయ పరిస్థితులు, ఎదురవుతున్న సమస్యలపై సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో బోయిన్పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముప్పిడి గోపాల్,పి. రాజు, దళిత రత్న దర్గా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కటాక్షపూర్‌లో రూ.37 వేలకు గణపతి లడ్డు



**ఆత్మకూర్,సెప్టెంబర్23(పీసీడబ్ల్యూ న్యూస్):** మండలంలోని కటాక్షపూర్ గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడికి నవరాత్రుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి చేతిలో ఉంచిన ఐదు కిలోల లడ్డును వేలం వేయగా రూ.37 వేల ధర పలికింది.ఈ లడ్డును వాడుకారి సంగీతరమేష్ దంపతులు కైవసం చేసుకున్నారు. లడ్డు కైవసం చేసుకున్న రమేష్ కుటుంబ సభ్యులు జ్యోతి, రాజు, హిమజ, కృష్ణ, పిల్లలు వర్షిత్, వికాస్, వేదశ్రీ, తేజ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ సభ్యులు, నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.11,616కు వినాయకుడి లడ్డు వేలం



**ఆత్మకూర్,సెప్టెంబర్23(పీసీడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కటాక్షపూర్ గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఈ సందర్భంగా తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథుడి లడ్డును వేలం పాట నిర్వహించారు.వేలం పాటలో డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి చెందినా మన్విత ప్రవీణ్ దంపతులు రూ.11,616లకు లడ్డును కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కిషన్‌గంజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

- పాల్గొన్న బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ రావు




**హైదరాబాద్, సెప్టెంబర్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** కిషన్‌గంజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని పేదలకు అన్నవితరణ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ సేవ, దాతృత్వం కేవలం ఒక చర్య మాత్రమే కాదని, సమాజం పట్ల ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పేదలకు అండగా నిలుస్తూ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కిషన్‌గంజ్ యూత్ అసోసియేషన్ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.బజరంగ్ సేన నాయకులు హరి, సాయి, సంతోష్, నరేందర్ యాదవ్, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లంపల్లిలో గణనాథుని లడ్డూ వేలం.. రూ.37,001

**మల్లంపల్లి మండల ప్రతినిధి సెప్టెంబర్ 23 (పి సి డబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండల కేంద్రంలో గణనాథుని లడ్డూ వేలం పాట ఉత్సాహంగా జరిగింది. భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేలం పాటలో ధూమాల హార్దిక్ యాదవ్ రూ.37,001లకు లడ్డూను దక్కించుకున్నారు. గణనాథుని ఆశీస్సులతో కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.నిర్వాహకులు హార్దిక్ యాదవ్‌ను అభినందించారు.



# వాసవి గోల్డ్ అండ్ డైమండ్స్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు




**- పోటీపడి రూ. 55 వేలకు గణపతి లడ్డూను దక్కించుకున్న భక్తుడు నితీష్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రముఖ నగల వ్యాపార సంస్థ 'వాసవి గోల్డ్ అండ్ డైమండ్స్' ప్రాంగణంలో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవరాత్రుల ముగింపు సందర్భంగా సంస్థ ఆవరణలో కొలువుదీరిన విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు, హోమాలు, మహా మంగళహారతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ వేడుకల్లో సంస్థ యాజమాన్యంతో పాటు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గణనాథుని దర్శించుకున్నారు.**పోటాపోటీగా లడ్డూ వేలం పాట:** పూజా కార్యక్రమాల అనంతరం నిర్వహించిన గణపతి లడ్డూ వేలం పాట అత్యంత ఉత్కంఠభరితంగా సాగింది. స్వామివారి ప్రసాదాన్ని దక్కించుకునేందుకు భక్తులు, సంస్థ ప్రతినిధులు తీవ్రంగా పోటీ పడ్డారు. చివరకు ఓ భక్తుడు నితీష్ గరిష్ఠంగా రూ. 55,000 (యాభై ఐదు వేల రూపాయలు) పలికి స్వామివారి దివ్య లడ్డూ ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. భక్తి ప్రపత్తులతో లడ్డూను వేలంలో దక్కించుకున్న విజేతను సంస్థ యాజమాన్యం శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపింది.**విజయాలు చేకూరాలని యాజమాన్యం ఆకాంక్ష:** ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ రాజు మడిపడిగే, సీఈవో సత్యవతి ప్రసన్న మాట్లాడుతూ లంబోదరుని ఆశీస్సులతో అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు కలగాలని ఆకాంక్షించారు. తమ సంస్థ అభివృద్ధిలో భాగస్వాములవుతున్న సిబ్బందికి, ఆదరిస్తున్న వినియోగదారులకు ఈ సందర్భంగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు (వీణం) ధీరజ్, సూరజ్ లతో పాటు వేణు, స్వాతి, అశ్విని, సాయి, సచిన్, నవనీత్, ఓంకార్, సుప్రజ, మౌనిక, పవన్, శ్రవణ్ మరియు సంస్థ సిబ్బంది అంతా పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం విచ్చేసిన భక్తులకు, అతిథులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద పంపిణీ చేశారు.



# చప్టాల కూల్చివేతతో మున్నేరు వెలవెల

**- నిమజ్జనాలకు నీరులేక భక్తుల మనోవేదన**

**- తాగునీటి ఎద్దడిపై బీఆర్ఎస్ నాయకుడు తోట రామారావు ఆవేదన**








**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఏళ్ల తరబడి ఖమ్మం నగర ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు పండుగల వేళ భక్తుల ఆధ్యాత్మిక వేడుకలకు వేదికగా నిలిచిన మున్నేరు నేడు నీరు లేక వెలవెలబోతోందని ఖమ్మం బీఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్ తోట రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రకాష్‌నగర్ చప్టా, రంగనాయకులగుట్ట చప్టాల వద్ద నీటి నిల్వలతో మున్నేరు కళకళలాడేదని, అదే ప్రాంతంలో వినాయక నిమజ్జనాలు, బతుకమ్మ సంబరాలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగేవని గుర్తుచేశారు. చప్టాల కూల్చివేతతో మున్నేరు నీటి ప్రవాహానికి అడ్డుకట్ట తొలగిపోయి, ప్రస్తుతం నిమజ్జనాలకు సైతం నీరు అందని పరిస్థితి నెలకొందని తోట రామారావు పేర్కొన్నారు. పండుగ రోజులలో భక్తులు ఆనందంగా గణనాథుడికి వీడ్కోలు పలకాల్సిన సమయంలో, నిమజ్జనానికి అనువైన నీటి వనరు కోసం వెతకాల్సిన దుస్థితి రావడం బాధాకరమన్నారు. తాగునీటి అవసరాలు, ప్రజల భావోద్వేగాలు, పండుగల సంప్రదాయాలను దృష్టిలో పెట్టుకుని నీటి వనరుల పరిరక్షణపై పాలకులు ముందుచూపుతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

**దంసలాపురం చెరువుతో ఉత్సవ కమిటీలకు నిరుత్సాహం... తీర్థాల చప్టాను పరిశీలించి ప్రత్యామ్నాయ నిమజ్జన ప్రాంతం సూచన**

మున్నేరులో నీరు లేకపోవడంతో అధికారులు సూచించిన దంసలాపురం చెరువు గణేష్ ఉత్సవ కమిటీలకు అనుకూలంగా లేక నిరుత్సాహానికి గురిచేస్తోందని ఆయన తెలిపారు. ప్రజా ప్రతినిధిగా పరిస్థితిని స్వయంగా పరిశీలించిన తాను ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తీర్థాల చప్టా ప్రాంతాన్ని పరిశీలించినట్లు చెప్పారు. సుమారు 15 అడుగుల లోతు ఉన్న ఈ ప్రాంతం నిమజ్జనాలకు అనువుగా ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వినతిపత్రం సమర్పించి అవసరమైన అనుమతులు పొందేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. అధికారులను ఒప్పించి అక్కడ నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకున్నామని, త్రీటౌన్ ప్రాంతంలోని గణేష్ ఉత్సవ కమిటీలకు కూడా ఈ విషయాన్ని తెలియజేసినట్లు తోట రామారావు తెలిపారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలకడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఇక రానున్న బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళా భక్తుల మనోభావాలను గౌరవించి, గతంలో మాదిరిగానే కాల్వఒడ్డు, మున్నేరు ప్రాంతంలో భక్తిశ్రద్ధలతో సంబరాలు నిర్వహించుకునేలా ప్రభుత్వం, అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. ప్రజలకు నీరు, భక్తులకు పండుగ, నగరానికి సహజ నీటి వనరులు, ఈ మూడు అంశాలను సమన్వయం చేసుకుంటేనే ఖమ్మం పండుగల సొబగు తిరిగి వస్తుందని తోట రామారావు పేర్కొన్నారు.

# హాలో ఉద్యమకారుడ చలో యాదగిరిగుట్ట




**రామన్నపేట సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఉద్యమకారుల ఫోరం 9వ వార్షికోత్సవాన్ని లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం సన్నిధిలో నిర్వహించుటకు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు యాదగిరిగుట్టలోని లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్లో జరగబోయే సమావేశానికి రాష్ట్రంలోని నలుమూలల నుండి 33 జిల్లాల ఉద్యమకారులు ఉద్యమ కారినీలు తరలివచ్చి ఉద్యమకారుల ఫోరం సమావేశాన్ని విజయవంతం చేయాలని గత తొమ్మిది సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఉద్యమకారులను ఫోరం ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ఉద్యమకారులను ఏకం చేసి ఉద్యమ స్ఫూర్తిని చాటిన ఉద్యమకారుల ఫోరం 9 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేసి వేలాది మంది ఉద్యమకారులకు అండగా నిలిచి ఉద్యమ కమిటీ ఏర్పాటు చేయడానికి ముఖ్యపాత్ర వహించి హైకోర్టును ఆశ్రయించి విజయం సాధించిన ఘనత ఉద్యమకారుల దేనాని ఈ సమావేశం ఉదయం పదకొండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తారని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న ఒక పత్రిక ప్రకటనలో తెలియజేశారు

# నకిరేకల్‌లో బిచ్చనపల్లి ప్రకాష్ రావు సంతాప సభ



**రామన్నపేట సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతాప సభ ఘనంగా జరిగింది. ప్రముఖుడు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి అయిన బిచ్చనపల్లి ప్రకాష్ రావు చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకాష్ రావు చేసిన సేవలను, సమాజానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# రామన్నపేటలో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు





**రామన్నపేట సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రామన్నపేట మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి సందర్శించారు గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపాల వద్ద నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అక్కెనపల్లి ప్రవీణ్, దావనూరు వెంకటేష్, బాకూరి శివకుమార్, సింగు శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వరద పరిస్థితులపై పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**• జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ • వరద పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ • 24 గంటల పాటు అందుబాటులో కంట్రోల్ రూమ్ • అత్యవసర పరిస్థితుల్లో వెంటనే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలి • టోల్‌ఫ్రీ నంబర్: 1077, సెల్ నంబర్ 9063211298**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వాగులు, వంకలు, చెరువులు, ప్రాజెక్టులు, కాలువలు తదితర ప్రాంతాల్లో నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, పరిస్థితిని బట్టి అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వరద నీటి ప్రవాహం అధికంగా ఉన్న వాగులు, వంకలు, కాలువలు, చెరువులు, నదులను దాటేందుకు ప్రజలు ప్రయత్నించ రాదని కలెక్టర్ సూచించారు. వరద నీటిలో వాహనాలతో ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు, నీట మునిగిన ప్రాంతాలు తదితర ప్రమాదకర ప్రాంతాలకు ప్రజలు దూరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారులపై వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో రాకపోకలను పర్యవేక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపల్, నీటిపారుదల, వైద్య, విద్యుత్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు వరదలకు సంబంధించిన ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు. కంట్రోల్ రూమ్‌కు అందిన సమాచారంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు. కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబర్: 1077, కంట్రోల్ రూమ్ సెల్ నంబర్ : 9063211298 ప్రజలు ఈ నంబర్లను వినియోగించుకొని వరద పరిస్థి తులు, అత్యవసర సమస్యలపై సమాచారం అందిం చాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# రామన్నపేటలో మేకల దొంగల ముఠా అరెస్ట్ - నలుగురు అరెస్ట్




**రామన్నపేట సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రామన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మేకల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. నిడానపల్లి గ్రామంలో ఈ నెల 20వ తేదీ రాత్రి మేక దొంగతనం జరిగినట్లు బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ఈరోజు జనంపల్లి క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా మేకల దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. అరెస్ట్ అయిన నిందితులు:సాంపంగి వెంకన్న (60), అలీనగర్, ఇబ్రహీంపేట సాంపంగి శారద (44), అలీనగర్, ఇబ్రహీంపేట ఎమ్మెడ్డి శ్రీనివాస్ రెడ్డి (48), గూడాపూర్, మునుగోడు గుంజ గోపి (52), రామ్ నగర్ బజార్, నిడమనూరునిందితుల వద్ద నుండి రూ.10,000 నగదు, ఒక సెల్ ఫోన్, దొంగతనానికి ఉపయోగించిన స్విఫ్ట్ కారు (టిఎస్ 09 డిఈ 3128) ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై గతంలో కూడా పలు దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ జి. సతీష్ తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో గణేష్ అన్నదానం.. భక్తులకు అన్నప్రసాదం వడ్డించిన ఎమ్మెల్సీ శంకర్ నాయక్





**మిర్యాలగూడ సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ వార్డు మెంబర్ బొంగర్ల సుకన్యవినోద్ ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించి, గణేష్ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రెగట్టి రవీందర్ రెడ్డి, ఎస్సై డి.వెంకటేశ్వర్లు, టీపీసీసీ సభ్యుడు చిరుమరి క్రిష్ణయ్య, స్థానిక సర్పంచ్ పుట్టల సందీప్, వార్డు సభ్యులు మాతంగి సుధీర్, ఎస్.కె. హాజీ, నవీద్, రావు ఎల్లారెడ్డి, పుట్టల కృపయ్య, గంజి శ్రీనివాస్, చల్లా వెంకట్ రెడ్డి, చక్ర టీవీ అధినేత కొండా లక్ష్మణ్, పుట్టల పెద్ద వెంకన్న, మాతంగి చంటి, దైద గిరి, పగడాల వెంకన్న, కోట వెంకన్న తదితరులు పాల్గొన్నారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పందిరి రవి, చిట్టిపల్లి బాలకృష్ణ, పగడాల రాకేష్, రేవంత్, సుమంత్, వెంకటేష్, చందు, శ్రీనుతో పాటు గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని వి జయవంతం చేశారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమం భక్తుల ఐక్యతకు, ఆధ్యాత్మిక స్ఫూర్తికి ప్రతీకగా నిలిచింది.

# కొణిజర్లలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

**- 24న ఎస్సీ కమిటీ హాల్‌లో నిర్వహణ**

**కొణిజర్ల సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నెల 24న గురువారం కొణిజర్ల ఎస్సీ కమిటీ హాల్‌లో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక నిర్వహించనున్నట్లు మండల మాజీ అధికార ప్రతినిధి కొర్లకంటి రవికుమార్ మాదిగ తెలిపారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి కందికట్ల విజయ్ మాదిగ, ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షుడు తురుగంటి అంజయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్ మాదిగ హాజరుకానున్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై ఎన్నికను విజయవంతం చేయాలని రవికుమార్ కోరారు.

# సంపాదకీయం

## ఫార్మాడ్రగ్స్ మత్తులో యువత




దేశం లోని అనేక రాష్ట్రాల్లో యువత హెరాయిన్ అనే మత్తు పదార్థానికి బానిసలవుతున్నారు. మార్ఫిన్, కోడైన్, ఆక్సికోడోన్, ఫెంటానిల్, హెరాయిన్ అనేవి ఓపియాయిడ్లు. ఇవి మెదడు, నాడీ వ్యవస్థపై ప్రధానంగా నొప్పి తగ్గించడానికి వినియోగిస్తారు. వైద్యపరంగా సరైన మోతాదులో వీటిని వినియోగిస్తే నొప్పి నియంత్రణలో సహాయపడతాయి. వీటిని వ్యసనంగా చేసుకుని ఎక్కువ మోతాదులో వాడితే లేదా తప్పుగా వాడితే నిద్రమత్తు, మలబద్ధకం, శ్వాస నెమ్మదించడం, క్రమంగా ప్రాణాంకతం కావచ్చు. జనాభా శాతంతో చూస్తే ఒపియాయిడ్ సమస్య మిజోరం, నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, మణిపూర్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ రాష్ట్రాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. పదేళ్ల వయసు నుంచి 75 ఏళ్ల వృద్ధుల వరకు దాదాపు 2% మంది హెరాయిన్‌ను అత్యధికంగా వినియోగిస్తున్నారని 2018 నాటి సర్వేలో బయటపడింది. అలాగే పాఠశాల విద్యార్థుల్లో వీటి వినియోగం 2.8 శాతంగా నమోదైంది. హెరాయిన్‌కు బానిసైన యువతలో చదువు, ఉద్యోగం, సామాజిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం ఉంటోంది. శారీరక, మానసిక ఆరోగ్యం బాగా దెబ్బతింటోంది. డ్రగ్స్ అక్రమ రవాణాలో అగ్రస్థానంలో ఉన్న పంజాబ్‌లో ప్రస్తుతం హెరాయిన్ లభ్యత బాగా తగ్గిపోవడంతో దాని స్థానంలో ఫార్మాస్యూటికల్ డ్రగ్స్ వినియోగం యువతలో పెరిగింది. ఈ ఫార్మాస్యూటికల్ మత్తు పదార్థాలు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద మొత్తంలో పంజాబ్ లోకి వస్తుండడం వీటిని నివారించడం పోలీస్‌లకు పెద్ద సవాలుగా మారింది. ఈ ఫార్మాడ్రగ్స్‌లో ఎక్కువ భాగం పంజాబ్‌లో తయారు కావడం లేదు. ఇవి హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీల్లో తయారవుతున్నాయి. ఈ రాష్ట్రాలకు సంబంధించిన మత్తుమందుల్లో 11.54 లక్షల ఫార్మాస్యూటికల్ మాత్రలు, కాప్సూల్స్‌ను గత సంవత్సరం నుంచి స్వాధీనం చేసుకున్నారు. పంజాబ్‌లో అందుబాటులో ఉన్న ఈ డ్రగ్స్ లో సుమారు 80% ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్నాయని అంచనా. ఇది గతంలో ఉన్న పరిస్థితికి పూర్తి విరుద్ధం. అప్పట్లో పంజాబ్ లోకి అక్రమంగా వచ్చే డ్రగ్స్‌లో సుమారు 80 శాతం పాకిస్థాన్ సరిహద్దు అవతలి నుంచి అక్రమ రవాణా అయ్యేవి. 2024లో పంజాబ్‌లో పెద్ద మొత్తంలో మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు. 2024 తొలి ఆరు నెలల్లోనే 215 కిలోల హెరాయిన్ స్వాధీనం అయింది. ఇప్పుడు కొత్త ధోరణి పంజాబ్‌లో కనిపిస్తోంది. ఫార్మా ఔషధాల దుర్వినియోగం ఎక్కువైంది. ఇప్పుడు ఫార్మాడ్రగ్స్ ఉత్పత్తి అయ్యే రాష్ట్రాలు, వాటిని ఇతర ప్రాంతాలకు తరలించే మార్గం లోని రాష్ట్రాలు కలిసి డ్రగ్స్ తయారీదారులు, పంపిణీదారులు, అలాగే వ్యవస్థీకృతంగా పనిచేస్తున్న డ్రగ్ నెట్‌వర్క్‌లపై సమన్వయంతో చర్యలు తీసుకోవలసిన అవసరం ఏర్పడింది. డ్రగ్స్ తయారీ యూనిట్ల నియంత్రణ, విక్రయం, కొనుగోలు, రవాణా వీటిన్నిటినీ పర్యవేక్షించడం, అవి పంజాబ్‌కు అక్రమంగా మళ్లించబడకుండా నిరోధించడం తదితర కార్యకలాపాల నివారణకు పాకిస్థాన్ సరిహద్దు నుంచి డ్రోన్ల ద్వారా మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి బిఎస్‌ఎఫ్, పోలీస్ దళాలు బహుళ స్థాయి చర్యలు చేపట్టారు. ఈ చర్యల ఫలితంగా పంజాబ్‌లో వీధుల్లోనే విచ్చలవిడిగా లభించే హెరాయిన్‌ను అడ్డుకోగలిగారు. దీంతో పంజాబ్ యువతకు హెరాయిన్ లభ్యంకాక, మత్తు కలిగించే ఫార్మాడ్రగ్స్ వాడటం ప్రారంభమైంది. సెప్టెంబర్ 3న మొబైల్ డ్రోన్ గుర్తింపు వేదిక అయిన 'డ్రోన్ సెన్స్ డి 200 ప్రో'కు చెందిన మూడు యూనిట్లు సరిహద్దు జిల్లాల్లోని వ్యూహాత్మక ప్రాంతాల్లో ఏర్పాటయ్యాయి. డ్రగ్స్‌ను అక్రమంగా రవాణా చేసే డ్రోన్లకు సంబంధించిన కార్యకలాపాలను గుర్తించి, వాటి ఖచ్చితమైన స్థానాన్ని, డ్రోన్లు ఎక్కడైతే డ్రగ్స్‌ను విడిచిపెడతాయో కనుక్కోగలగడం ఈ డ్రోన్‌సెన్స్ డి 200 ప్రో వ్యవస్థ లక్ష్యం. దీని ద్వారా భద్రతా సిబ్బంది సకాలంలో అక్కడకు చేరుకుని చర్యలు తీసుకోగలుగుతుంది. ఈ చర్యల కోసం 52 డ్రోన్ రెస్పాన్స్ టీమ్స్ (డిఆర్‌టిఎస్) ఏర్పాటయ్యాయి. వీటిలో 147 మంది పోలీస్ సిబ్బంది ఉంటారు. ఈ బృందాలు బిఎస్‌ఎఫ్‌తో కలిసి పనిచేస్తాయి. డ్రోన్ల డ్రగ్స్ రవాణా సంబంధమైన హెచ్చరికలు వచ్చిన వెంటనే ఈ బృందాలు స్పందించి డ్రోన్లు ఎక్కడైతే డ్రగ్స్‌ను జారవిడిచాయో అక్కడకు వెళ్లి నిఘా ఉంటాయి. ఆ ప్రదేశాల్లో గస్తీ కాసి, డ్రగ్స్‌ను తీసుకెళ్లడానికి వచ్చిన వారిని పట్టుకుంటాయి. ఈమేరకు పోలీసులు మొత్తం 9 యాంటీ డ్రోన్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. వీటిలో 3 'బాజ్'యాంటీడ్రోన్ వ్యవస్థలు. గత సంవత్సరం ఆగస్టు నుంచి అమృత్‌సర్, తరన్ తారన్, ఫిరోజ్‌పూర్ ప్రాంతాల్లో ఇవి పనిచేస్తున్నాయి. ఇవి డ్రగ్స్ రవాణా డ్రోన్ల కదలికలను ముందుగానే పసికట్టి వాటి కమ్యూనికేషన్‌ను స్తంభింప చేస్తాయి. అలాగే సరిహద్దు ప్రాంతాల్లో విలేజీ డిఫెన్స్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలే పోలీసులకు కళ్లు, చెవులుగా పనిచేస్తాయి. 'యుద్ధ్ నషా విరుద్ధ్ (మాదకద్రవ్యాల వ్యతిరేక) ప్రచారం ద్వారా 2025 మార్చి 1నుంచి డ్రగ్స్ అక్రమ రవాణాదారులైన దాదాపు 80,000 మందిని అరెస్ట్ చేశారు. డ్రగ్ నెట్‌వర్క్‌ల ఆర్థిక పునాదులను దెబ్బతీయడానికి ఆర్థిక ఆంక్షలతో కూడిన చర్యలను తీసుకుంటున్నారు. డ్రగ్స్ ఉత్పత్తికి, అక్రమ రవాణాకు పాల్పడిన వారికి సంబంధించిన రూ. 336 కోట్లకు పైగా ఆస్తులను స్తంభింప చేశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా సమాచారం ఎవరైనా తెలియజేసినా, వాటి ఆచూకీ చెప్పగలిగినా అలాంటి వారికి రివార్డు పాలసీని అమలు చేస్తున్నారు. డ్రగ్స్ రవాణా డ్రోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నందుకు రూ. 25,000 నగదు బహుమతిని అందిస్తున్నారు.

## మళ్లీ తెరపైకి ఉమ్మడి పౌరస్మృతి



జనసంఘ్ 1957, 1962 ఎన్నికల ప్రణాళిక లు హిందూ కోడ్ చట్టాన్ని రద్దు చేయాలని కోరాయి. కానీ ఉమ్మడి పౌర స్మృతి గురించి ప్రస్తావించలేదు. ఈ డిమాండ్ 1967 ప్రణాళికలో కనిపించినప్పటికీ, 1971 లో మాయమైంది. 1980లో వచ్చిన బిజెపి తొలి ఎన్నికల ప్రణాళికలో కూడా దీని గురించి ఏమీ పేర్కొనలేదు. అటల్ బిహారీ వాజ్‌పేయి పార్టీ అధ్యక్షుడిగా ఉన్న 1984లో కూడా పరిస్థితి అలాగే ఉంది. కానీ ఎనభైల మధ్యలో ఎల్‌కె అద్వానీ నాయకత్వంలోని పార్టీ మూడు అంశాలను ప్రధాన ఎజెండాగా తీసుకుంది: యుసిసి, ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం. 1985 నాటి షా బానో కేసు సమయంలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కలిసి యుసిసిని తమ ప్రధాన డిమాండ్లలో ఒకటిగా మార్చుకున్నాయి.

# ఒంటరితనం.. లాభసాటి వ్యాపారం




ఒంటరితనం వ్యాపారంలో అత్యంత లాభదాయకమైన, సున్నితమైన భాగంగా రహస్య డేటింగ్ యాప్‌లు అవతరించాయి. గ్లీడెన్, ప్యూర్, ఆష్లే మ్యాడిసన్ వంటి ప్రైవేట్ వేదికలు వినియోగదారుల అనామకతను ఆసరాగా చేసుకుని కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నాయి. ఉదాహరణకు, ఎక్స్‌ట్రా- మారిటల్ డేటింగ్ యాప్ 'గ్లీడెన్' ఒక్క భారత్‌లోనే ఏకంగా 40 లక్షల (4 మిలియన్లు) వినియోగదారుల మైలురాయిని దాటింది. ఇందులో హైదరాబాద్ (17%), బెంగళూరు (18%), ఢిల్లీ, ముంబై నగరాలు ప్రధాన పాత్ర పోషిస్తుండగా, మహిళల నమోదులో 148 శాతం వృద్ధి నమోదవడం గమనార్హం. సాధారణ డేటింగ్ యాప్‌లలో వినియోగదారుడి సగటు వార్షిక రాబడి 15 నుంచి 20 డాలర్లు ఉంటే, ఈ రహస్య యాప్‌లలో ఇది ఏకంగా 50 డాలర్లు (రూ. 4,200 పైగా) దాటుతోంది. పే-పర్-మెసేజ్, చాటింగ్ క్రెడిట్లు, ప్రైవేట్ ఫిల్టర్ల పేరిట ఈ కంపెనీలు శరవేగంగా లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ, కుటుంబ వ్యవస్థల్లో అశాంతి, బ్లాక్ మెయి లింగ్ మోసాలకు ఇవి దారితీస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం మనుషులను ప్రపంచానికి అనుసంధానించామని చెబుతున్న ప్పటికీ, క్షేత్రస్థాయిలో అది తీవ్రమైన ఏకాంతాన్ని, సామాజిక దూరాన్ని వదిలిపెట్టింది.

మానవ జీవితంలో ఏకాంతం అనేది కేవలం ఒక వ్యక్తిగత మానసిక వేదన మాత్రమే కాదు, అది ఆధునిక డిజిటల్ యుగంలో వందల బిలియన్ డాలర్ల టర్నోవర్‌తో వర్ధిల్లుతున్న అత్యంత లాభదాయకమైన 'లోన్లీనెస్ ఎకానమీ' (ఒంటరితనం ఆధారిత ఆర్థిక వ్యవస్థ) గా అవతరించింది. క్రమబద్ధమైన శారీరక క్షీణత, హృద్రోగాలు, తీవ్రమైన కుంగుబాటు (డిప్రెషన్), సోషల్ యాంగ్జయిటీకి దారితీస్తున్న ఈ ఏకాంతాన్ని ప్రపంచ ఆరోగ్య నిపుణులు తీవ్రమైన ముప్పుగా హెచ్చరిస్తున్నారు.

రోజుకు 15 సిగరెట్లు తాగడం వల్ల శరీరానికి కలిగేంత నష్టం సుదీర్ఘకాలపు ఒంటరితనం వల్ల జరుగుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ విశ్లేషిస్తుండగా, మనుషుల్లోని ఈ భావోద్వేగ రహిత ఖాళీ తనాన్నే డిజిటల్ వేదికలు, సామాజిక మాధ్యమాలు తమ ప్రధాన పెట్టుబడిగా మార్చుకుని ప్రపంచవ్యాప్తంగా వేల కోట్లు కొల్లగొడుతున్నాయి. మనుషుల నిశ్శబ్దాన్ని, ఏకాంతాన్ని నిరంతరం సొమ్ము చేసుకోవడంలో బిగ్ టెక్ సంస్థలు ముందు వరసలో ఉన్నాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్ వంటి సామాజిక మాధ్యమాలు తమ అల్గారిథమ్‌ల ద్వారా వినియోగదారులను గంటల తరబడి స్క్రీన్‌లపై ఉంచుతూ 'అటెన్షన్ ఎకానమీ'ని నడుపుతున్నాయి. మెటా సంస్థ ఏడాదికి సుమారు 130 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 10.8 లక్షల కోట్లు) పైగా ప్రకటనల రాబడిని పొందుతుండగా, మానవ అనుబంధాల కోరికను ఆసరాగా చేసుకుని 'మ్యాచ్ గ్రూప్' ఏడాదికి 3.4 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 28 వేల కోట్లు), 'బంబుల్' 1 బిలియన్ డాలర్ల వార్షిక రాబడి సాధిస్తున్నాయి. ఇందుకు తోడు 'క్యారెక్టర్ ఎఐ' , 'రెప్లికా' వంటి కంపెనీలు చాట్‌బాట్‌లను అందుబాటులోకి తెచ్చి మిలియన్ల మంది ఒంటరి వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. పారాసోషల్ సంబంధాల ద్వారా 'ఓన్లీఫ్యాన్స్' ఏటా 6.6 బిలియన్ డాలర్ల లావాదేవీలను నమోదు చేస్తూ, 1.3 బిలియన్ డాలర్ల (రూ. 10,800 కోట్లు) నికర ఆదాయాన్ని ఆర్జిస్తోంది. స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ల పరిమితులను దాటి, ఆఫ్‌లైన్‌లో నేరుగా కలవాలనే తపనతో భారత్‌లోని హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి ఐటి నగరాల్లో 'లెట్స్ సోషలైజ్' భావన కొత్త వ్యాపార రంగానికి ఊపిరి పోసింది.

ద్వితీయ శ్రేణి నగరాల నుంచి వచ్చి మెట్రోలలో పనిచేస్తున్న ఐటి ఉద్యోగులు, యువతను అపరిచితులతో కలిపే ఆఫ్‌లైన్ మీటప్ యాప్‌లు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వారాంతాల్లో అపరిచితులను ఒకే టేబుల్‌పైకి తెచ్చి డిన్నర్ మీటప్‌లు నిర్వహించే 'టైమ్‌లెఫ్ట్', స్పోర్ట్ డిస్కవరీ వేదిక 'ప్లేయో', 'మీటప్', 'బంబుల్ బిఎఫ్‌ఎఫ్' వంటి యాప్‌లు భారీగా వృద్ధి చెందుతున్నాయి. ఈ ప్లాట్‌ఫామ్‌లు సబ్‌స్క్రిప్షన్ల ద్వారానే కాకుండా, స్థానిక రెస్టారెంట్లు, కేఫ్‌లతో ఒప్పందాలు కుదుర్చుకుని ఒక్కో వ్యక్తి నుంచి ఈవెంట్‌కు రూ. 500 నుంచి రూ. 2,000 వరకు వసూలు చేస్తూ పటిష్టమైన రాబడి నమూనాను అమలు చేస్తున్నాయి. ఈ ఒంటరితనం వ్యాపారంలో అత్యంత లాభదాయకమైన, సున్నితమైన భాగంగా రహస్య డేటింగ్ యాప్‌లు అవతరించాయి. గ్లీడెన్, ప్యూర్, ఆష్లే మ్యాడిసన్ వంటి ప్రైవేట్ వేదికలు వినియోగదారుల అనామకతను ఆసరాగా చేసుకుని కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నాయి. ఉదాహరణకు, ఎక్స్‌ట్రా- మారిటల్ డేటింగ్ యాప్ 'గ్లీడెన్' ఒక్క భారత్‌లోనే ఏకంగా 40 లక్షల (4 మిలియన్లు) వినియోగదారుల మైలురాయిని దాటింది. ఇందులో హైదరాబాద్ (17%), బెంగళూరు (18%), ఢిల్లీ, ముంబై నగరాలు ప్రధాన పాత్ర పోషిస్తుండగా, మహిళల నమోదులో 148 శాతం వృద్ధి నమోదవడం గమనార్హం. సాధారణ డేటింగ్ యాప్‌లలో వినియోగదారుడి సగటు వార్షిక రాబడి 15 నుంచి 20 డాలర్లు ఉంటే, ఈ రహస్య యాప్‌లలో ఇది ఏకంగా 50 డాలర్లు (రూ. 4,200 పైగా) దాటుతోంది.

పే-పర్-మెసేజ్, చాటింగ్ క్రెడిట్లు, ప్రైవేట్ ఫిల్టర్ల పేరిట ఈ కంపెనీలు శరవేగంగా లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ, కుటుంబ వ్యవస్థల్లో అశాంతి, బ్లాక్ మెయిలింగ్ మోసాలకు ఇవి దారితీస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం మనుషులను ప్రపంచానికి అనుసంధానించామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అది తీవ్రమైన ఏకాంతాన్ని, సామాజిక దూరాన్ని వదిలిపెట్టింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు మానవ ఉద్వేగ బలహీనతను కోట్లాది డాలర్ల వ్యాపార నమూనాగా మార్చుకుని లాభపడుతుండగా, సామాజిక అనుబంధాల లోపం తో మనుషులు మానసిక, ఆర్థిక నష్టాలను మూటగట్టుకుంటున్నారు. సమాజంలో ఆత్మీయమైన మానవ బంధాలు పునరుదరణకానంత వరకు ఈ 'ఒంటరితనం ఆధారిత ఆర్థిక వ్యవస్థ' మరిన్ని కొత్త రూపాల్లో విస్తరిస్తూనే ఉంటుంది.

# రైతు భరోసాకు డ్రోన్ టెక్నాలజీ

వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగం వేగం పుంజుకుంటోంది. పంటలకు పురుగు మందులు, ద్రవ ఎరువుల పిచికారీతోపాటు పంటల పర్యవేక్షణ, వ్యవసాయ సేవలను వేగంగా అందించడంలో డ్రోన్ల వినియోగం విస్తరిస్తోంది. రైతులకు డ్రోన్ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు గ్రామీణ మహిళలు, యువతకు కొత్త ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, కిసాన్ డ్రోన్ల ప్రోత్సాహానికి ఇప్పటివరకు రూ. 141.39 కోట్లు విడుదలయ్యాయి. రైతులకు 527 డ్రోన్లు అందించడంతోపాటు 1,595 డ్రోన్ కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. రైతుల పొలాల్లో 27,099 డ్రోన్ ప్రదర్శనలు నిర్వహించి, సుమారు 30.23 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ప్రదర్శనలు చేపట్టగా, 3.51లక్షల మంది రైతులు వాటి ద్వారా లబ్ధి పొందారు. డ్రోన్ వినియోగానికి సంబంధించి 287 మంది డ్రోన్ పైలట్లకు శిక్షణ ఇచ్చినట్లు కేంద్రం తెలిపింది. తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ వినియోగానికి పరిశోధన, ప్రయోగాల ద్వారా పునాది పడింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంనకు 2021లో డి జిసిఎ అనుమతులు లభించడంతో పంట రక్షణ, పురుగు మందుల పిచికారీ, తెగుళ్లు, వ్యాధుల గుర్తింపుపై డ్రోన్లతో పరిశోధనలు జరిగాయి. 2022లో వరి పంటలో డ్రోన్ ఆధారిత పిచికారీకి ప్రామాణిక విధానం రూపొందించగా, అనంతరం వరి, పత్తి, కంది, వేరుశెనగ, సోయాబీన్, నువ్వులు, కుసుమ వంటి ఏడు పంటలకు పంట -నిర్దిష్ట డ్రోన్ పిచికారీ



విధానాలు అభివృద్ధి చేసినట్లు రిచ్ నివేదిక పేర్కొంది. అలాగే తెలంగాణ ప్రభుత్వం, పిజెటిఎస్‌ఎయు, రిచ్, అగ్రిటెక్ స్టార్టప్‌ల భాగస్వామ్యంతో ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను పొలాల్లో పరీక్షించే కార్యక్రమాలు చేపట్టాయి. డ్రోన్ టెక్నాలజీతో పాటు పంట పర్యవేక్షణ, నీటి నిర్వహణ, పోషక యాజమాన్యం వంటి అంశాల్లోనూ సాంకేతిక పరిష్కారాలను పరీక్షించారు.

ఈ చర్యల ద్వారా తెలంగాణలో డ్రోన్ ఆధారిత వ్యవసాయానికి పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, ప్రయోగాల స్థాయిలో పునాది ఏర్పడింది. భవిష్యత్తులో ఈ సాంకేతికతను రైతులకు మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడం వ్యవసాయ యాంత్రీకరణలో కీలకంగా మారనుంది.

డ్రోన్ టెక్నాలజీని గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతతో అనుసంధానించేందుకు 'నమో డ్రోన్ దీదీ' పథకాన్ని కేంద్రం అమలు చేస్తోంది. 202324 నుంచి 2025-26 వరకు అమలయ్యే ఈ పథకానికి రూ. 1,261కోట్ల కేటాయింపుతో ఎంపిక చేసిన మహిళా స్వయం సహాయక సంఘాలకు 15,000 డ్రోన్లు అందించాలన్నది లక్ష్యం. ఈ సంఘాలు రైతులకు అద్దె ప్రాతిపదికన డ్రోన్ సేవలను అందించేలా పథకాన్ని రూపొందించారు. ఈ పథకం కింద డ్రోన్ ఖర్చులో 80% వరకు, గరిష్ఠంగా రూ. 8 లక్షల వరకు కేంద్ర ఆర్థిక సహాయం అందుతోంది. డ్రోన్‌తోపాటు స్ప్రే అసెంబ్లీ, అదనపు బ్యాటరీలు, నిర్వహణ, బీమా, డ్రోన్ పైలట్, సహాయకుడి శిక్షణ వంటి సదుపాయాలను ప్యాకేజీలో చేర్చారు. 2026 జనవరి నాటికి ప్రధాన ఎరువుల కంపెనీలు స్వయం సహాయక సంఘాలకు 1,094 డ్రోన్లు పంపిణీ చేయగా, అందులో 500 డ్రోన్లు నమో డ్రోన్ దీదీ పథకం కింద పంపిణీ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. వీటి నిర్వహణకు ఎంపికైన మహిళలకు డిజిసిఎ అనుమతించిన శిక్షణ సంస్థల్లో డ్రోన్ పైలట్ శిక్షణ ఇచ్చారు. తెలంగాణలోనూ ఈ కార్యక్రమానికి ప్రాధాన్యం లభిస్తోంది. కేంద్రం వెల్లడించిన రాష్ట్రాల వారీ వివరాల ప్రకారం, నమో డ్రోన్ దీదీ పథకం కింద పంపిణీ చేసిన తొలి 500 డ్రోన్లలో తెలంగాణకు చెందిన 72 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా కస్టమ్ హైరింగ్ సెంటర్లు, గ్రామస్థాయి వ్యవసాయ యంత్రాల బ్యాంకులతోపాటు కిసాన్ డ్రోన్ల ప్రదర్శనలు, కొనుగోలు, డ్రోన్ కస్టమ్ హైరింగ్ కేంద్రాల ఏర్పాటుకు కూడా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. పంటలపై రసాయనాల పిచికారీ నుంచి పంట పర్యవేక్షణ వరకు డ్రోన్ల వినియోగం విస్తరిస్తున్న నేపథ్యంలో, భవిష్యత్తులో వ్యవసాయంలో డిజిటల్ సాంకేతికతకు మరింత ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంది. రైతులకు డ్రోన్ సేవలు సులభంగా, తక్కువ ఖర్చుతో అందుబాటులోకి వస్తే వ్యవసాయ యాంత్రీకరణకు మరింత ఊతం లభించే అవకాశముంది.

## వేడుకల్లో విషాదం..

జార్ఖండ్‌లోని పాలము జిల్లా, చైన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని బొకాయ్ గ్రామంలో బుధవారం విషాదకర సంఘటన జరిగింది. గిరిజన పండుగ అయిన 'కరం' పండుగ ముగిసిన తర్వాత సాంప్రదాయ పూజా సామగ్రి, చెట్టు కొమ్మను సమీపంలోని కోయెల్ నదిలో నిమజ్జనం చేయడానికి ఐదుగురు యువకులు, చిన్నారులు వెళ్లారు. నిమజ్జనం చేస్తున్న సమయంలో నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం, లోతు ఎక్కువగా ఉండటంతో ఐదుగురు ప్రమాదవశాత్తు



ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఈ ఘటనలో ముగ్గురు మైనర్లతో సహా కనీసం ఐదుగురు మునిగి మరణించారు. సమాచారం మేరకు ఘటనస్థలికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టినప్పటికి లాభం లేకపోయింది. ప్రవాహంలో మునిగిపోవడం వల్ల వారు ప్రాణాలు కోల్పోయారు. అనంతరం జాలర్లు మృతదేహాలను బయటకు తీసుకొచ్చారు. ఒకే గ్రామానికి చెందినవారు ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో బొకాయ్ గ్రామంలో తీవ్ర శోకసంద్రం అలుముకుంది..

# వెండికొండ మీరాబాయి

### వెయిట్‌లిఫ్టింగ్‌లో రజతం సొంతం
### బ్యాడ్మింటన్‌లో మెన్స్ జట్టుకు కాంస్యం
### 2026 ఆసియా క్రీడలు

ఓ ఒలింపిక్ పతకం, ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో మూడు మెడల్స్. కామన్‌వెల్త్ క్రీడల్లో మరో మూడు పతకాలు. ఆసియా చాంపియన్‌షిప్స్‌లోనూ ఓ మెడల్. ప్రతిష్టాత్మక క్రీడా ఈవెంట్లలో అన్నింటా పోడియం ఫినిష్ చేసినా, అయినా ఏదో వెలితి. అదే ఆసియా క్రీడల్లో మెడల్. 2026లో ఆ లోటును తీర్చుకుంది దిగ్గజ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను. ఆసియా క్రీడల్లో మహిళల 49 కేజీల విభాగంలో మీరాబాయి చాను రజత పతకం సాధించింది.ఆసియా క్రీడల్లో భారత వెయిట్‌లిఫ్టింగ్ పతక నిరీక్షణకు తెరపడింది. 1998 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో తెలుగు తేజం కరణం మల్లీశ్వరి మహిళల 63 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించగా.. సరిగ్గా 28 ఏండ్ల తర్వాత ఆసియా క్రీడల్లో మరో భారత వెయిట్‌లిఫ్టర్ వెండి కాంతులతో వెలుగొందింది. ఇటు భారత్‌తో పాటు మీరాబాయి చానుకు సైతం ఆసియా క్రీడల్లో పతక వెలితి వేధించింది. 2014 ఆసియా క్రీడల్లో తొలిసారి పోటీపడిన మీరాబాయి చాను తొమ్మిదో స్థానంలో నిలిచింది. 2018 జకర్తా ఆసియా క్రీడలకు గాయంతో దూరమైంది. 2023 గాంగ్జౌ ఆసియా క్రీడల్లో నాల్గో స్థానంతో పతకానికి అడుగు దూరంలో ఆగిపోయింది. టోక్యో ఒలింపిక్స్‌లో సిల్వర్ మెడల్‌తో శిఖర స్థాయికి చేరుకున్న మీరాబాయి చాను.. ఆసియా క్రీడల్లో పసిడి ఫేవరేట్‌గా బరిలోకి దిగింది. 49కేజీల మహిళల విభాగంలో స్నాచ్‌లో 87 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కేజీలు ఎత్తింది. ఓవరాల్‌గా 198 కేజీలతో మీరాబాయి చాను రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. దక్షిణ కొరియా వెయిట్‌లిఫ్టర్, డిఫెండింగ్ ప్రపంచ చాంపియన్ రి సంగ్ గమ్ 215 కేజీలతో (94o121) బంగారు పతకం నిలుపుకుంది. ఆసియా క్రీడల్లో దక్షిణ కొరియా వెయిట్‌లిఫ్టర్‌కు ఇది వరుసగా మూడో బంగారు పతకం. ఇండోనేషియా వెయిట్‌లిఫ్టర్ లులుక్ దయానా 191 కేజీలు (88o103) మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం దక్కించుకుంది. స్నాచ్‌లో మీరాబాయి చాను 83 కేజీలు, 85 కేజీలు, 87కేజీలు ఎటువంటి తడబాటు లేకుండా అలవోకగా ఎత్తిపడేసింది. క్లీన్ అండ్ జెర్క్‌లో తొలుత 107 కేజీలు ఎత్తిన మీరాబాయి చాను ఆ తర్వాత 111 కేజీలతో మెరుగైంది. కానీ ఆ తర్వాత మూడో ప్రయత్నం చేయలేదు. 'కొంత ఒత్తిడి ఉండేది. కానీ పతకం నెగ్గుతానా లేదా అనేంత ఒత్తిడి కాదు. మెడల్ సాధిస్తాననే నమ్మకం నాకుంది. నన్ను నమ్మేవాళ్లకు నాపై అంచనాలు ఉన్నాయి. నా కోచ్‌లు, సహాయక సిబ్బంది నేను దేశానికి మరో మెడల్ సాధించేందుకు సహకరించారు'అని మీరాబాయి చాను తెలిపింది. మహిళల 53 కేజీల విభాగంలో పోటీపడిన జ్ఞానేశ్వరి యాదవ్ 195 కేజీలు (87o108)తో ఎనిమిదో స్థానంలో నిలిచింది. **బ్యాడ్మింటన్‌లో కాంస్యం** పురుషల బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్‌లో భారత్ కాంస్య పతకం సాధించింది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో అగ్రజట్టు చైనా చేతిలో భారత్ 1-3తో పరాజయం పాలైంది. తొలి సింగిల్స్‌లో లక్ష్యసేన్ 16-21, 18-21తో షి యుకి చేతిలో ఓడాడు. డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ 21-11, 22-2-తో లియాంగ్, చాంగ్‌లపై గెలుపొంది లెక్క సమం చేశారు. రెండో సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి 19-21, 13-21తో షి ఫెంగ్ చేతిలో కంగుతిన్నాడు. రెండో డబుల్స్‌లో హరిహరణ్, ఎంఆర్ అర్జున్ జోడీ 16-21, 9-21తో నిరాశపరిచారు. దీంతో చైనా 3-1తో గెలుపొంది ఫైనల్‌కు చేరుకుంది. సెమీస్‌లో ఓటమితో భారత్ కాంస్య పతకంతో సరిపెట్టుకుంది.వుషూలో భారత్ కనీసం సిల్వర్ మెడల్ ఖాయం చేసుకుంది. మహిళల వుషూ 60 కేజీల విభాగంలో రోషిబినా దేవి పసిడి పోరుకు చేరుకుంది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో ఇండోనేషియా అమ్మాయి తానియాపై 2-0తో రోషిబినా దేవి గెలుపొందింది. నేడు ఫైనల్లో పసిడి పతకం కోసం చైనా అమ్మాయి జాంగ్‌తో రోషిబినా దేవి పోటీపడనుంది.



**షూటింగ్‌లో డబుల్ ధమాకా** షూటింగ్‌లో భారత్ బుధవారం డబుల్ ధమాకా మోగించింది. స్కీట్ టీమ్ విభాగంలో భారత పురుష, మహిళల జట్లు కాంస్య పతకం సాధించాయి. మహేశ్వరి చౌహాన్, పరినాజ్ దాలివాల్, రైజా ధిల్లాన్‌లతో కూడిన మహిళల జట్టు 331 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం నెగ్గింది. చైనా (357), కజకిస్తాన్ (336) గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించాయి. అనంత్‌జిత్ సింగ్, మేరాజ్ అహ్మద్ ఖాన్, భవతేజ్ సింగ్ గిల్‌తో కూడిన మెన్స్ జట్టు 346 పాయింట్లతో కాంస్య పతకం సాధించింది. స్టార్ షూటర్ మను భాకర్ మహిళల 10మీ ఎయిర్ పిస్టల్ విభాగంలో ఐదో స్థానంలో నిలిచి నిరాశపరిచింది. 10మీ ఎయిర్ పిస్టల్ జట్టు విభాగంలో ఇషా సింగ్, సురుచి సింగ్, మను భాకర్ త్రయం వియత్నాంతో కలిసి 1719 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచినా.. మెరుగైన ఇన్నర్ 10 స్కోరింగ్‌తో వియత్నాం కాంస్య పతకం దక్కించుకుంది. **సాఫ్ట్‌టెన్నిస్‌లో మెడల్ ఖాయం** ఆసియా క్రీడల్లో భారత్ తొలిసారి సాఫ్ట్ టెన్నిస్‌లో పతకం ఖాతాలో వేసుకోనుంది. పురుషుల వ్యక్తిగత సాఫ్ట్‌టెన్నిస్‌లో జే మీనా సెమీఫైనల్‌కు ప్రవేశించాడు. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో షెర్విన్ నుగియట్‌పై ఏడు గేముల థ్రిల్లర్‌లో గెలుపొందాడు. 0-4, 4-2, 2-4, 4-2, 5-3, 2-4, 7-5తో జే మీనా విజయం సాధించి సెమీస్‌కు చేరుకున్నాడు. జే మీనా సెమీస్‌లో అడుగుపెట్టి కనీసం కాంస్య పతకం ఖాయం చేసుకున్నాడు.



## సాఫ్ట్ టెన్నిస్‌లో కాంస్య పతకం

హైదరాబాద్: ఆసియా క్రీడల సాఫ్ట్ టెన్నిస్ విభాగంలో భారతదేశం చారిత్రక ఘనత సాధించింది. పురుషుల సింగిల్స్ విభాగంలో మధ్యప్రదేశ్‌కు చెందిన 26 ఏళ్ల క్రీడాకారుడు జయ్ మీనా కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. ఆసియా గేమ్స్ చరిత్రలోనే ఈ క్రీడలో భారత్‌కు పతకం దక్కడం ఇదే తొలిసారి.బుధవారం నాటి సెమీఫైనల్ పోరులో జపాన్‌కు చెందిన టకుయా కురోసాకాతో జయ్ మీనా తలపడ్డాడు. 45 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్ ప్రారంభంలో జయ్ వరుసగా మూడు గేమ్‌లు ఓడిపోయి ఒత్తిడిలో పడ్డాడు. ఆ తర్వాత అనూహ్యంగా పుంజుకుని వరుసగా రెండు గేమ్‌లను (4-1, 6-4) తన ఖాతాలో వేసుకుని మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చాడు.



## ఆసియా క్రీడల్లో భారత్‌కు డబుల్ పతకాలు

ఆసియా క్రీడల్లో భారత పతకాల వేట కొనసాగుతోంది. బుధవారం రెండు ఈవెంట్లలో మెడల్స్ దక్కాయి. స్కీట్ టీమ్ విభాగంలో భారత మహిళ, పురుష జట్లు కాంస్యం దక్కించుకున్నాయి. అటు భారత స్టార్ షూటర్ మను బాకర్ నిరాశకు గురిచేసింది. మహిళల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో భారత త్రయం రైజా దిల్లాన్, మహేశ్వరి చౌహన్, పరినాజ్ ధలీవాల్.. 331 స్కోరుతో మూడో స్థానంలో నిలిచారు. దీంతో కాంస్యం దక్కింది. ఈ ఈవెంట్‌లో చైనా బృందానికి బంగారు పతకం రాగా.. కజకిస్థాన్ టీమ్ రజతం గెలిచింది.ఇక, పురుషుల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో అనంత్‌జీత్ సింగ్ నరుకా, భవతేగ్ సింగ్ గిల్, మైరాజ్ అహ్మద్ ఖాన్.. 346 స్కోరుతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం సాధించారు. మరోవైపు, వ్యక్తిగత విభాగంలో అనంత్‌జీత్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఒలింపిక్‌లో డబుల్ మెడల్స్‌తో ఆకట్టుకున్న మనుబాకర్‌కు.. ఆసియా గేమ్స్‌లో నిరాశ ఎదురైంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో కొద్దిలో ఆమె పతకం చేజార్చుకుంది. ఫైనల్ పోరులో 181.1 స్కోరుతో మను ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. ఇదే విభాగం టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్ల బృందం కాంస్యాన్ని త్రుటిలో మిస్ అయ్యింది. అటు సాఫ్ట్ టెన్నిస్ పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాడు జై మీనాకు కాంస్యం దక్కింది. సెమీస్‌లో జపాన్ క్రీడాకారుడి చేతిలో జై 2-4తో ఓటమిపాలయ్యాడు.

## కుర్రాళ్లు కుమ్మేశారు.. ఆసీస్‌తో సిరీస్ క్లీన్ స్వీప్



రాజ్‌కోట్: ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన మూడు అనధికారిక వన్డేల సిరీస్‌ని భారత అండర్-19 జట్టు 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. రాజ్‌కోట్ వేదికగా జరిగిన మూడో అనధికారిక వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ నామమాత్రపు మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 254 పరుగులకు ఆలౌట్ అయింది. ఓపెనర్ జెడ్ హోలిక్(87), నీల్ పటేల్(51) అర్ధ శతకాలతో రాణించారు. భారత బౌలర్లలో మోహిత్ ఉల్వ, మోనల్ చౌహన్ తలో మూడు వికెట్లు తీయగా.. ఆర్యన్ సవసాని, కావ్య పటేల్ చెరో వికెట్ పడగొట్టారు.అనంతరం లక్ష్య చేధనకు దిగిన భారత్‌కు మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ శుభారంభం అందించాడు. 31 బంతులు ఎదురుకున్న అతడు 5 ఫోర్ల సాయంతో 34 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. అనంతరం కెప్టెన్ లక్ష్య రాయ్‌చందన్ ఆసీస్ బౌలర్లను టార్గెట్ చేశాడు. ఆచితూచి ఆడుతూ.. 100 బంతుల్లో సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. 106 బంతులు ఎదురుకున్న అతడు 9 ఫోర్లు, 3 సిక్సులతో 110 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. వీరితో పాటు కుశాగ్ర ఓర్ఝా(45), రజత్ బఘేల్ (44 నాటౌట్) రాణించారు. ఫలితంగా భారత్ 4 వికెట్లు కోల్పోయి 41.2 బంతుల్లో లక్ష్యాన్ని చేధించింది. ఆసీస్ బౌలర్లలో స్పెన్సర్ గ్రీన్ రెండు వికెట్లు సాధించాడు.

## కెప్టెన్ శతకం వృథా.. రెండో వన్డేలో ఆసీస్ చేతిలో భారత్ ఓటమి

మొహాలీ: మూడు అనధికారిక వన్డేలు, మూడు అనధికారిక టి-20లు, ఒక అనధికారిక టెస్ట్ ఆడేందుకు ఆస్ట్రేలియా మహిళల ఎ జట్టు భారత్‌కు వచ్చింది. ఇందులో భాగంగా టి-20 సిరీస్‌ను కంగారూ జట్టు 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. అయితే ఆదివారం జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. అయితే మొహాలీ వేదికగా జరిగిన రెండో వన్డేలో భారత్‌కు పరాజయం తప్పలేదు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 338 పరుగుల భారీ స్కోర్‌ను సాధించింది. కెప్టెన్ యస్తికా భాటియా సెంచరీతో చెలరేగింది. 84 బంతుల్లోనే 16 ఫోర్లు, 2 సిక్సుల సాయంతో 112 పరుగులు చేసింది. ఇక తేజల్ హసాబ్నిస్ (60), అనుష్క శర్మ (60 నాటౌట్) అర్థ శతకాలు సాధించారు. ఆసీస్ బౌలింగ్‌లో డార్సీ బ్రౌన్ మూడు వికెట్లు, మిల్లీ ఇల్లింగ్‌వర్త్ రెండు వికెట్లు, లల్లీ మిల్స్ ఒక వికెట్ తీశారు.అనంతరం లక్ష్య చేధనలో ఆసీస్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ నికోలి ఫాల్తుమ్(12)ను సయాలీ సత్గరే తక్కువ స్కోర్‌కే పెవిలియన్ పంపింది. కానీ ఆ తర్వాత మరో ఓపెనర్ తాహిలా విల్సన్ (79), అనికా లిరాయిడ్ (54) హాఫ్ సెంచరీలు చేశారు. ఇక చార్లి నాట్ 37 బంతుల్లోనే 63 పరుగులతో అదరగొట్టింది. హేలీ సిల్వర్ హోమ్స్ (47), టెస్ ఫ్లింటాఫ్ (38) పరుగులతో రాణించారు. అయితే భారత బౌలర్లు విజయం సాధించడానికి ఆఖరి వరకూ పోరాడారు. కానీ, విజయం మాత్రం ఆసీస్‌ని వరించింది. 49.3 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయిన ఆసీస్ 341 పరుగులు చేసి రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఫలితంగా ఈ సిరీస్‌ని 1-1 తేడాతో సమం చేసింది. మూడో వన్డే శుక్రవారం మొహాలీ వేదికగా జరగనుంది.



# కూచిపూడితో మెప్పించిన డింపుల్ హయాతి..

## తిరుమలలో ప్రత్యేక ప్రదర్శన!



టాలీవుడ్ అందాల భామ డింపుల్ హయాతి తిరుమలలోని నాద నీరాజనం వేదికపై అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి భక్తులను, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎరుపు, గోల్డ్ కలర్ సిల్క్ చీర కట్టి, సంప్రదాయ వస్త్రధారణలో భక్తిశ్రద్ధలతో ఆమె ప్రదర్శించిన కూచిపూడి నాట్యం అందరినీ మంత్రముగ్ధులను చేసింది.ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఆ విశేషాలు చూద్దాం.. శ్రీవారి బ్రహ్మోత్సవాల పవిత్ర సమయంలో డింపుల్ హయాతి నాద నీరాజనం వేదికపై కూచిపూడి నాట్యం చేయడం విశేషం. సంప్రదాయబద్ధమైన నృత్య భంగిమలు, చక్కటి ముఖకవళికలతో ఆమె చేసిన ప్రదర్శన భక్తులకు కనులవిందుగా నిలిచింది. ఇక నృత్య ప్రదర్శనకు ముందు రోజు ఆమె తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. నెటిజన్ల ఆశ్చర్యం, ప్రశంసలు : ఇన్నాళ్లూ సినిమాల్లో గ్లామరస్ పాత్రల్లో అలరించిన డింపుల్ హయాతిలో ఈ స్థాయి సంప్రదాయ నాట్య ప్రతిభ కూడా ఉందా అని నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. ఇక సోషల్ మీడియాలో ఆమె డ్యాన్స్ వీడియోలు చూసిన అభిమానులు "డింపుల్ గారు చాలా అందంగా, అద్భుతంగా నాట్యం చేశారు" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.సినిమా కెరీర్ మరియు క్రేజ్: తెలుగు, తమిళ సినిమాల్లో నటించి మంచి నటిగా పేరు తెచ్చుకున్న డింపుల్, వరుణ్ తేజ్ నటించిన 'గద్దలకొండ గణేష్' చిత్రంలో 'జర్రా జర్రా' స్పెషల్ సాంగ్‌తో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఆ తర్వాత ఖిలాడి, రామబాణం, అత్రంగి రే, వీరమే వాగై సూడుమ్, భర్త మహాశయులకు విజ్ఞప్తి వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు దగ్గరైంది. 'ఆదర్శ కుటుంబం'తో త్వరలో ముందుకు: ప్రస్తుతం సరైన సినిమా బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న డింపుల్ హయాతి, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వెంకటేష్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో నటిస్తున్నట్లు టాక్. ఈ భారీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం అక్టోబర్ 9న థియేటర్లలోకి రాబోతోంది. ఈ సినిమాతో ఆమెకు పెద్ద హిట్ అందుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.ఇక అంతేగాక శర్వానంద్ 38వ సినిమా సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలో ఓ పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.వెండితెరపై తన గ్లామర్, నటనతో ఆకట్టుకునే డింపుల్ హయాతి, తిరుమలలో ప్రదర్శించిన కూచిపూడి నాట్యంతో తనలోని సంప్రదాయ కళాత్మక కోణాన్ని ఆవిష్కరించారు. భక్తిభావంతో ఆమె చేసిన ఈ ప్రదర్శన ప్రతి ఒక్కరి మనసులను దోచుకోవడమే కాకుండా, ఆమె కెరీర్‌కు మరింత సానుకూలతను తీసుకువస్తుందనడంలో సందేహం లేదు.

# ఇక మైత్రీ థియేటర్లలో 'సర్వపిండి'..


## సినిమా చూస్తూ కమ్మని రుచి.. 'ది ప్యారడైజ్'తో ఎంట్రీ!




ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ 'మైత్రీ' తమ థియేటర్ల ద్వారా ఓ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. సినిమా అనుభూతికి తెలంగాణ సంస్కృతిని, అచ్చమైన పల్లె రుచులను జోడిస్తూ సరికొత్త నిర్ణయం తీసుకుంది. ఇకపై తమ థియేటర్లలో తెలంగాణ సంప్రదాయ వంటకమైన 'సర్వపిండి'ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

తొలి దశలో భాగంగా మైత్రీ విమల్, మైత్రీ శివగంగ థియేటర్లలో ఈ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నారు. త్వరలో విడుదల కానున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్' ప్రదర్శన సమయంలో విరామంలో ప్రేక్షకులు ఈ కమ్మని సర్వపిండిని ఆస్వాదించవచ్చు. సినిమా చూస్తూనే, తెలంగాణ ప్రత్యేక వంటకాన్ని రుచి చూసే ఈ కొత్త అనుభవం సినీ ప్రియులను ఆకట్టుకుంటుందని సంస్థ భావిస్తోంది.ఈ సరికొత్త ఆలోచన వెనుక సోషల్ మీడియాలో ప్రజాదరణ పొందిన 'బామ్మాస్టోరిస్'కు చెందిన 77 ఏళ్ల బామ్మ కృషి ఉంది. ఓ చిన్న టిఫిన్ సెంటర్‌లో ఆమె ప్రేమతో తయారు చేసే సర్వపిండి, ఇప్పుడు ఏకంగా బిగ్ స్క్రీన్ ప్రేక్షకులకు చేరువ కావడం విశేషం. వెండితెరపై దృశ్యాలను ఆస్వాదిస్తూనే, తెలంగాణ అసలైన రుచిని అందించాలన్న మైత్రీ థియేటర్స్ ప్రయత్నంపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# పుష్ప సినిమాలో ఆ పాత్ర నేను చేయాల్సింది.. కానీ!: శివాజీ



టాలీవుడ్ నటుడు శివాజీ 'తెల్ల కాగితం' సినిమా ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతూ... ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన దిగ్గజ చిత్రం 'పుష్ప'కు సంబంధించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. 'పుష్ప' చిత్రంలో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న ప్రతి నాయక ఛాయలున్న 'మంగళం శ్రీను' పాత్ర మొదట తనకే రావలసి ఉందని శివాజీ తెలిపారు.ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ... "మంగళం శ్రీను పాత్రకు మొదట సుకుమార్ నన్నే అనుకున్నారు. కానీ ఒక పాత్ర ఎవరికి రాసి ఉంటే చివరికి వాళ్లకే దక్కుతుంది. నాకు రాసి లేని పాత్రను నేనెలా చేయగలను? ఆ పాత్ర సునీల్‌కే రాసి పెట్టి ఉంది, అందుకే ఆయన వద్దకు వెళ్లింది. సునీల్ ఆ పాత్రలో అద్భుతంగా జీవించారు, ఎవరు ఏ పాత్ర చేసినా చివరికి అది వాళ్లకే సరిపోతుంది" అని వ్యాఖ్యానించారు.'తెల్ల కాగితం' విశేషాలను ఆయన పంచుకుంటూ... సినిమాల్లోకి రీ-ఎంట్రీ ఇచ్చే సమయంలో తాను విన్న రెండో కథ ఇదేనని, కథ బాగా నచ్చడంతో ఈ చిత్రాన్ని తానే నిర్మించాలని అనుకున్నట్లు తెలిపారు. అయితే ఈ కథ పలువురు నిర్మాతల చేతులు మారి, చివరకు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అధినేత దిల్ రాజు, కృష్ణ కొమ్మలపాటి సంయుక్త నిర్మాణంలో తెరకెక్కి తన వద్దకే రావడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. రమేశ్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో పాటు, గ్రాఫిక్స్ కు ప్రాధాన్యత ఉన్న 'కూర్మావతారం' అనే చిత్రంలోనూ తాను నటిస్తున్నట్లు శివాజీ వెల్లడించారు.

# 'ప్యారడైజ్'లో నాని 'జడల్' పాత్రకు స్ఫూర్తి ఈ ఫొటోనే!



నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటించిన తాజా యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్'. ఈ చిత్రం రేపు (సెప్టెంబరు 24) విడుదల కానున్న నేపథ్యంలో, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సినిమాలోని కీలకమైన 'జడల్' పాత్రకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. ఈ పాత్రకు, ముఖ్యంగా నాని జడల లుక్‌కు తన చిన్ననాటి జ్ఞాపకాలే స్ఫూర్తి అని ఆయన వెల్లడించారు.

ఈ సందర్భంగా శ్రీకాంత్ ఓదెల సోషల్ మీడియాలో తన చిన్ననాటి ఫొటోను పంచుకుంటూ ఒక భావోద్వేగ పోస్ట్ పెట్టారు. "జడల్ పుట్టుక, యుద్ధం కల్పితం కావచ్చు... కానీ అతని జడలు, లుక్ నా చిన్నప్పటి స్ఫూర్తితో వచ్చినవే. అమ్మ నాకు 5, 6 ఏళ్ల వయసు వరకు జడలు వేసి కట్టేవారు. నేను పెద్దయ్యాక, కమర్షియల్ సినిమాలో ఒక హీరో జడలతో 70వీవీ స్క్రీన్‌పై ఎలా ఉంటాడా అని ఎప్పుడూ ఊహించుకునేవాడిని. ఇప్పుడు నా హీరో నాని అన్నను జడల్‌గా మీ ముందు ఉంచుతున్నాను. ఈ చిత్రం కేవలం నా చిన్నతనం కాదు, నా ప్యారడైజ్" అని ఆయన పేర్కొన్నారు.

శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో నాని 'జడల్' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన లుక్ ఇప్పటికే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచింది. ఈ చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సీనియర్ నటుడు మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దర్శకుడు పంచుకున్న ఈ వ్యక్తిగత విషయం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది.



# తెలుగు ఇండస్ట్రీని చూసి కన్నీళ్లొచ్చాయి : 'ది ప్యారడైజ్' నటుడు రాఘవ్ జుయల్

ప్రముఖ డ్యాన్సర్, నటుడు రాఘవ్ జుయల్.. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంతో తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. ఈ సందర్భంగా టాలీవుడ్‌లో పనిచేసిన అనుభవాన్ని పంచుకుంటూ, ఇక్కడి పని సంస్కృతిపై ప్రశంసల వర్షం కురిపించారు. తెలుగు పరిశ్రమలో సినిమాను ఒక వేడుకలా జరుపుకునే విధానం తనను ఎంతగానో ఆకట్టుకుందని ఆయన పేర్కొన్నారు.శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నప్పుడు, సినిమా నిర్మాణం పట్ల ఇక్కడి వారికి ఉన్న అభిరుచి, గౌరవాన్ని దగ్గర నుంచి చూశానని రాఘవ్ తెలిపారు.

ఆయన మాట్లాడుతూ.. "ఇక్కడ సినిమాను, సినిమా వాళ్లను ఎంతగా గౌరవిస్తారో చూసి నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ప్రతి ఒక్క టెక్నీషియన్‌కు ఎంతో గౌరవం ఇస్తారు. సౌండ్ ఇంజనీర్‌ను కూడా ప్రేక్షకులు గుర్తుపట్టడం నన్ను ఆశ్చర్యపరిచింది. ఇక్కడ వారు కేవలం పని పూర్తి చేయడానికి రారు, సినిమాను సెలబ్రేట్ చేసుకోవడానికి వస్తారు. ఈ విషయాన్ని నేను నేర్చుకున్నాను" అని భావోద్వేగంగా చెప్పారు. తనపై దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రభావం ఎంతో ఉందని కూడా రాఘవ్ చెప్పుకొచ్చారు.ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో పుట్టి పెరిగిన రాఘవ్, 'డ్యాన్స్ ఇండియా డ్యాన్స్ 3' రియాలిటీ షోతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. 'క్రాక్‌రాక్స్' అనే స్టేజ్ పేరుతో తన స్లో-మోషన్ డ్యాన్సింగ్ స్టైల్‌తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. ఆ తర్వాత 'డ్యాన్స్ ప్లస్' వంటి అనేక విజయవంతమైన టీవీ షోలకు హోస్ట్‌గా వ్యవహరించారు.

# నంది అవార్డుల కోసం దరఖాస్తు విధానం- మార్గదర్శకాలు!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ - నాటకరంగ అభివృద్ధి సంస్థ (విజయవాడ) 2025 సంవత్సరానికి సంబంధించిన -చలనచిత్ర నంది బహుమతులు - 2025- , ౧౨ నంది బహుమతులు - 2025- కోసం అధికారిక ప్రకటనను విడుదల చేసింది. తెలుగు చలనచిత్ర పరిశ్రమను, టెలివిజన్ రంగాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం ఈ పురస్కారాలను అందజేస్తోంది. అర్హులైన నిర్మాతలు, కళాకారులు, సాంకేతిక నిపుణుల నుండి దరఖాస్తులను సంస్థ ఆహ్వానించింది. చలనచిత్ర విభాగంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నంది చలనచిత్ర నిబంధనలను అనుసరించి 2025 సంవత్సరానికి ఉత్తమ ఫిల్మ్ నిర్మాతలు, ఉత్తమ కళాకారులు.. ఉత్తమ సాంకేతిక నిపుణులకు ఈ అవార్డులు ప్రదానం చేయనున్నారు. తెలుగు భాషలో భారతదేశంలో ఎక్కడైనా నిర్మించి.. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ -సీబీఎఫ్‌సీ ద్వారా థియేటర్లలో ప్రదర్శించిన చిత్రాలు, జాతీయ సమైక్యతపై చిత్రాలు, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీలు, విద్యాసంబంధమైన చిత్రాలు అలాగే తెలుగు సినిమా మీద వచ్చిన పుస్తక రచనలు, రచయితలు, నిర్మాతలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.




ఇక టెలివిజన్ రంగానికి సంబంధించి 2025 సంవత్సరానికి నంది టి.వి. చిత్ర నిబంధనల ప్రకారం ఉత్తమ టి.వి. చిత్ర నిర్మాతలు, కళాకారులు, సాంకేతిక నిపుణులను సత్కరించనున్నారు. టెలిఫిల్మ్, టి.వి. ఫీచర్స్, టి.వి. మెగాసీరియల్స్, డైలీ సీరియల్స్, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీ చిత్రాలు, సామాజిక అంశాలు, విద్య సంబంధిత చిత్రాల రూపకర్తలు ఈ బహుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవార్డులకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు.. ఇతర వివరాలను సంస్థ అధికారిక వెబ్‌సైట్ **www.apsftvdc.in** ద్వారా తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను



పొందుపరుచుటకు చివరి తేదీగా 12.10.2026ను నిర్ణయించారు. ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన దరఖాస్తుల ప్రింట్ ప్రతులను సంబంధిత డాక్యుమెంట్లతో జతపరిచి నిర్దేశిత గడువులోగా అందజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తుల హార్డ్ కాపీలను -మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ, 4వ అంతస్తు, ఎన్.టి.ఆర్. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, పండిట్ నెహ్రూ బస్ కాంప్లెక్స్, విజయవాడ - 520013- చిరునామాకు పంపడానికి చివరి తేదీ 16.10.2026గా ఖరారు చేసినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, ఐ.ఏ.ఎస్., తెలిపారు. కళాకారులు - నిర్మాతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు.